

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్

JORDAR TELUGU DAILY ధి తెలుగు దినపత్రిక


అవినీతి అంతం - మా పంతం



కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 287 బుధవారం, నవంబర్ 04 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

ఫ్యాకల్టీ లేకున్నా.. మెడికల్ సీట్లకు అనుమతులా?

- తెలంగాణ ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో నిబంధనల అమలుపై అనుమానాలు
- కాగితాలపైనే అధ్యాపకులు.. ఆసుపత్రుల్లో వాస్తవంగా వైద్య సేవలెంత?
- తనిఖీలకు ముందే సమాచారం లీకవుతోందన్న ఆరోపణలు..
- అన్ని కళాశాలలపై సమగ్ర విచారణకు డిమాండ్



వరంగల్ జోర్దార్ నిఘా విభాగం

వైద్య విద్య అనేది కేవలం భవనాలు, తరగతి గదులు, ప్రయోగశాలలు, అధ్యాపకుల జాబితాలతో పూర్తయ్యే వ్యవహారం కాదు. విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్య అందాలంటే నిబంధనల ప్రకారం అర్హత కలిగిన అధ్యాపకులు, బోధనా సిబ్బంది, ప్రయోగశాలలు, క్లినికల్ శిక్షణతో పాటు తగిన రోగుల సంఖ్య, అనుబంధ ఆసుపత్రి సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండాలి. అయితే తెలంగాణలోని కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఈ ప్రమాణాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయన్న దానిపై అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీలపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థి తులను వెలుగులోకి తేవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.ప్రత్యేకంగా వరంగల్ జిల్లాలోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీకి పెద్ద సంఖ్యలో ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి ఉన్న నేపథ్యంలో, ఆ స్థాయి విద్యార్థులకు అవసరమైన ఫ్యాకల్టీ, సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్లు, డెమాన్స్ట్రేటర్లు, సాంకేతిక సిబ్బంది వాస్తవంగా అందుబాటులో ఉన్నారా? వారు క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్నారా? విద్యార్థులకు అవసరమైన బోధన, క్లినికల్ శిక్షణ అందుతున్నాయా? అనుబంధ ఆసుపత్రిలో తగినంత మంది రోగులు, వైద్య సిబ్బంది, పడకలు, ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర సేవలు ఉన్నాయా? అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

లేని ఫ్యాకల్టీని ఉన్నట్లు చూపిస్తున్నారా?

ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అవసరమైన ఫ్యాకల్టీ సంఖ్యను చూపించేందుకు రికార్డుల్లో పేర్లు నమోదు చేసి, వాస్తవంగా వారు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారా లేదా అన్నదానిపై అనుమానాలు ఉంటే వాటిని క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా నివృత్తి చేయాలి. ప్రతి విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్లు, డెమాన్స్ట్రేటర్లు, ఇతర సిబ్బంది వివరాలను పరిశీలించాలి.కమ్యూనిటీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్తో పాటు అన్ని విభాగాల్లో ఫ్యాకల్టీ నియామకాలు, విద్యార్హతలు, వైద్య రిజిస్ట్రేషన్, హాజరు, విధుల నిర్వహణను నిబంధనల ప్రకారం ధృవీకరించాలి. పోస్టులు ఖాళీగా ఉన్నాయా? అర్హతలకు అనుగుణంగా నియామకాలు జరిగాయా? రికార్డుల్లో చూపిస్తున్న వ్యక్తులు వాస్తవంగా అదే కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

ఒకే ఫ్యాకల్టీ.. రెండు మూడు చోట్లా?

మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీగా చూపిస్తున్న ప్రతి వైద్యుడి రిజిస్ట్రేషన్ వివరాలను సంబంధిత అధికారిక రికార్డులతో సరిపోల్చాలి. ఒకే వ్యక్తి ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ సంస్థల్లో పూర్తి స్థాయి విధులు నిర్వహిస్తున్నట్లు రికార్డులు కనిపిస్తే, నియామక పత్రాలు, హాజరు, జీతాల చెల్లింపులు, డ్యూటీ రోస్టర్లు, బయోమెట్రిక్ వివరాలను పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలి.కేవలం పేర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల కనిపించాయనే కారణంతో తప్పు జరిగిందని నిర్ధారించకుండా, సంబంధిత నిబంధనలకు అనుగుణంగా వారి వాస్తవ విధుల నిర్వహణపై విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

తనిఖీలకు ముందే సమాచారం లీక్ అవుతోందా?

కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీల తనిఖీలకు ముందే సమాచారం చేరుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో, తనిఖీల విధానంపైనా పారదర్శకత అవసరం. తనిఖీ బృందాలు ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.తనిఖీ రోజున మాత్రమే ఫ్యాకల్టీ, వైద్య సిబ్బంది హాజరవుతున్నారా? లేక సాధారణ రోజుల్లోనూ అదే స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా? అన్నది తెలుసుకునేందుకు బయోమెట్రిక్ హాజరు, హాజరు రిజిస్టర్లు, డ్యూటీ రోస్టర్లు, జీతాల చెల్లింపులు, సీసీ కెమెరా రికార్డులను పరస్పరం పోల్చి చూడాలి.

సీసీ కెమెరా ఫుటేజ్తో వాస్తవాలు బయటకు?

ఫ్యాకల్టీ, వైద్య సిబ్బంది వాస్తవ హాజరును నిర్ధారించడంలో సీసీ కెమెరా ఫుటేజ్ కీలకంగా మారవచ్చు. కళాశాల ప్రధాన ద్వారాలు, సిబ్బంది ప్రవేశ మార్గాలు, విభాగాల కారిడార్లు, ఆసుపత్రి ప్రవేశ ద్వారాలు, సంబంధిత కార్యాలయాల వద్ద అందుబాటులో ఉన్న ఫుటేజ్ను నిబంధనల ప్రకారం పరిశీలించాలి.

అవసరమైన కాలానికి సంబంధించిన సీసీ కెమెరా రికార్డులు, డీవీఆర్ లేదా ఎన్వీఆర్ లాగ్స్ అందుబాటులో ఉన్నాయా? వాటి నిల్వ కాలపరిమితి ఎంత? రికార్డులు ఎందుకు అందుబాటులో లేవు? అనే అంశాలను కూడా పరిశీలించాలి. విచారణ అవసరమైతే సంబంధిత డిజిటల్ రికార్డులను తక్షణమే భద్రపరచాలి.

ఆసుపత్రిలో రోగుల సంఖ్య ఎంత?

మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న ఆసుపత్రి పనితీరుపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలి. రోజువారీ ఓపీ, ఇన్పేషెంట్లు, పడకల సామర్థ్యం, వాస్తవ బెడ్ ఆక్యుపెన్సీ, ఐసీయూ పడకలు, ఆపరేషన్ థియేటర్ల వినియోగం, ప్రసవాలు, శస్త్రచికిత్సలు, ల్యాబ్ పరీక్షలు తదితర వివరాలను రికార్డులతో ధృవీకరించాలి.రికార్డుల్లో చూపిస్తున్న రోగుల సంఖ్యకు, వాస్తవ వైద్య సేవలకు మధ్య ఏమైనా వ్యత్యాసం ఉందా? అడ్మిషన్, డిశ్చార్జ్ రికార్డులు, ల్యాబ్ పరీక్షలు, ఫార్మసీ మందుల పంపిణీ, వైద్యుల డ్యూటీ రోస్టర్లు పరస్పరం సరిపోతున్నాయా? అనే అంశాలను పరిశీలించాలి.

నాణ్యమైన బోధన ఎక్కడ?

తగిన అనుభవం, అర్హత కలిగిన ఫ్యాకల్టీ అందుబాటులో లేకపోతే విద్యార్థుల వైద్య విద్య నాణ్యతపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రయోగశాలలు, క్లినికల్ శిక్షణ, రోగులతో ప్రత్యక్ష బోధన, విభాగాల వారీగా అధ్యాపకుల లభ్యత వంటి అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.
వైద్య విద్యను కేవలం సీట్ల సంఖ్య, ఫీజుల వసూళ్ల కోణంలో కాకుండా విద్యార్థులకు అందుతున్న బోధన, శిక్షణ, వైద్య సేవల నాణ్యత కోణంలోనూ పరిశీలించాల్సిన అవసరం ఉంది.

మూడేళ్ల రికార్డులపై ప్రత్యేక ఆడిట్

రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో గత మూడు సంవత్సరాలకు సంబంధించిన ఫ్యాకల్టీ నియామకాలు, విద్యార్హతలు, వైద్య రిజిస్ట్రేషన్ వివరాలు, హాజరు, బయోమెట్రిక్ రికార్డులు, జీతాల చెల్లింపులు, డ్యూటీ రోస్టర్లు, విభాగాల వారీ సిబ్బంది వివరాలు, ఓపీ, ఐపీ, శస్త్రచికిత్సలు, ల్యాబ్ పరీక్షలు, బెడ్ ఆక్యుపెన్సీ తదితర రికార్డులపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలి.కళాశాల యాజమాన్యాలు సమర్పించే వివరాలనే ఆధారంగా తీసుకోకుండా, సంబంధిత అధికారిక రికార్డులు, డిజిటల్ డేటా, ఆకస్మిక తనిఖీలు, బయోమెట్రిక్ హాజరు, ఆసుపత్రి సేవల గణాంకాలను స్వతంత్రంగా ధృవీకరించాలి.

అన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీలపై సమగ్ర విచారణ చేయాలి

ఒకటి రెండు కళాశాలలకే పరిమితం కాకుండా తెలంగాణలోని అన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీ లభ్యత, సీట్ల అనుమతులు, బోధనా సదుపాయాలు, ఆసుపత్రి సామర్థ్యం, రోగుల సంఖ్య, క్లినికల్ శిక్షణ, సిబ్బంది హాజరు తదితర అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వైద్య విద్యలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో, సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విద్యా విభాగం, జాతీయ వైద్య కమిషన్ నిబంధనల ప్రకారం స్వతంత్ర బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.నిబంధనలు ఉల్లంఘించినట్లు అధికారిక విచారణలో నిర్ధారణ అయితే, బాధ్యులపై వర్తించే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు ఎదుర్కొంటున్న కళాశాలలకు అన్యాయం జరగకుండా, పూర్తి రికార్డుల ఆధారంగా నిష్పక్షపాత విచారణ జరపాలి.

గొర్సపాలంలో జనసేనలోకి భారీగా చేరికలు

యనమల బాల గోవిందు ఆధ్వర్యంలో టీడీపీ నుంచి పలువురు జనసేనలోకి..



తొండంగి, నవంబరు 3: తొండంగి మండలం గొర్సపాలం గ్రామంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు ఆదేశాల మేరకు గొర్సపాలానికి చెందిన యనమల బాల గోవిందు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జనసేన నాయకులు నూతనంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.యనమల బాల గోవిందు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికలు గ్రామ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. జనసేన పార్టీ విధానాలు, నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా వారు వెల్లడించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు జనసేనలో చేరే అవకాశం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ కార్యక్రమంతో గొర్సపాలంలో జనసేన పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



గండిపేట్ మండల్ రిపోర్టర్ శ్రీనివాస్: విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హిమాయత్ సాగర్ సెక్షన్ నూతన ఏఈ రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ 123వ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్, విద్యానగర్, భూపాల్ నగర్, వెంకటేశ్వర కాలనీ, తిరుమల హిల్స్ కాలనీతో పాటు పలు బస్తీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఏఈ రమేష్ దృష్టికి తీసుకెళ్లారు.విద్యుత్ సరఫరా, ఇతర సమస్యలను వివరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. దీనిపై ఏఈ రమేష్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇంద్రానగర్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, శ్రీనివాస్, శాంతి నాయక్, పరశురాం, మల్లేష్, రాజు నాయక్, విద్యానగర్ జనరల్ సెక్రటరీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తండ్రి లేని బాలుడి చదువుకు 'రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ' చేయూత




వరంగల్, నవంబర్ 3: తండ్రిని కోల్పోయిన నిరుపేద విద్యార్థి చదువుకు రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకుంది. వరంగల్‌లోని లిటిల్ మాస్టర్ హైస్కూల్‌లో మొదటి తరగతి చదువుతున్న కొంగ అరుష్ వార్షిక విద్యా ఫీజు రూ.15,000లను క్లబ్ సభ్యులు స్వయంగా చెల్లించి తమ ఉదారతను చాటుకున్నారు.కోవిడ్ సమయంలో భర్తను కోల్పోయిన బాలుడి తల్లి కొంగ చందన తన కుమారుడి చదువుకు ఆర్థిక సహాయం అందించాలని రోటరీ క్లబ్‌ను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన క్లబ్ సభ్యులు వెంటనే బాలుడి విద్యా ఫీజును చెల్లించి కుటుంబానికి అండగా నిలిచారు.

కేసుల చిట్టా.. ఆరోపణల పర్వం!

లెక్చరర్‌పై వేటుకు సిఫారసు

హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి

సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్థికశాస్త్ర జూనియర్ లెక్చరర్‌గా పనిచేసిన లెక్చరర్ పై పలు తీవ్ర ఆరోపణలు నమోదయ్యాయి. అవినీతి, తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులు కూడబెట్టడం, ఉద్యోగుల విధులకు ఆటంకం కల్పించడం, బెదిరింపులు, మహిళా ఉద్యోగులపై వేధింపులు తదితర ఆరోపణలపై చర్యలు చేపట్టినట్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు.2019లో ఏసీబీ దాడి అనంతరం ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైనట్లు, అదే ఏడాది అక్టోబర్ 5 నుంచి ఆయన సస్పెన్షన్‌లో ఉన్నట్లు నివేదిక తెలిపింది. సస్పెన్షన్‌లో ఉన్నప్పటికీ కార్యాలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ సిబ్బందిపై ఒత్తిడి, బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.మహిళా ఉద్యోగుల ఫిర్యాదులపై పోలీసు కేసులు నమోదైనట్లు పత్రంలో పేర్కొన్నారు. విధులకు ఆటంకం కల్పించడం, దురుసుగా ప్రవర్తించడం, బెదిరించడం, కార్యాలయంలోకి వెళ్లి వేధించడం వంటి ఆరోపణలు ఇందులో ఉన్నాయి. ఈ ఫిర్యాదులపై ఇంటర్మీడియట్ విద్య కమిషనరేట్ అంతర్గత ఫిర్యాదుల కమిటీ విచారణ చేపట్టింది. ఫిర్యాదులు, సాక్ష్యుల వాంగ్మూలాలను పరిశీలించిన కమిటీ.. ఆరోపణలు నిరూపితమైనట్లు పేర్కొని క్రమశిక్షణా, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసినట్లు నివేదిక వెల్లడించింది. అంతర్గత ఫిర్యాదుల కమిటీ నివేదికను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు సమర్పించినట్లు పత్రంలో ఉంది. మరోవైపు సిబ్బంది, ముఖ్యంగా మహిళా ఉద్యోగుల భద్రత, శాఖకు సంబంధించిన రికార్డుల రక్షణ దృష్ట్యా మధుసూదన్‌రెడ్డిని ఇంటర్మీడియట్ విద్యాశాఖకు చెందిన పలు కార్యాలయ ప్రాంగణాల్లోకి ప్రవేశించకుండా నిషేధించినట్లు పేర్కొన్నారు.పలు క్రిమినల్ కేసులు, క్రమశిక్షణా ఆరోపణలు, విచారణ అధికారులు లేదా సాక్షులను ప్రభావితం చేసే అవకాశం వంటి అంశాల నేపథ్యంలో సాధారణ శాఖాపరమైన విచారణ నిర్వహించడం ఆచరణ సాధ్యం కాదని అధికారులు అభిప్రాయపడ్డారు. దీంతో తెలంగాణ సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం ఉద్యోగం నుంచి తొలగించే ప్రధాన శిక్ష విధించాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ మేరకు అప్పటి ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ 2023 ఏప్రిల్ 6న నివేదిక సమర్పించినట్లు పత్రంలో పేర్కొన్నారు



జమ్మికుంటలో గరుడ వస్త్ర సిల్క్ హవా.. మహిళా వస్త్ర ప్రియుల క్యూ!

■ తక్కువ ధరలకే ట్రెండీ డిజైన్లు..

■ ఐదు జిల్లాల నుంచి పోటెత్తుతున్న కొనుగోలుదారులు





జమ్మికుంట, జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి:

ఒకసారి చూస్తే మరోసారి రావాలనిపించే వెరైటీ డిజైన్లు.. ధరలు చూస్తే కొనకుండా ఉండలేని ఆకర్షణ.. నాణ్యతకు తగిన ధరలు.. వెరసి జమ్మికుంట పట్టణంలో గరుడ వస్త్ర సిల్క్ కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వస్త్రాల కొనుగోలుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో దుకాణం సందడిగా మారుతోంది. చుట్టుపక్కల గ్రామాలే కాకుండా కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల నుంచి సైతం మహిళా వస్త్ర ప్రియులు జమ్మికుంటకు వచ్చి తమకు నచ్చిన డిజైన్లను ఎంపిక చేసుకుంటున్నారు.

ధర తక్కువ.. డిజైన్లు ఎక్కువ!

సామాన్య, మధ్యతరగతి కుటుంబాల మహిళల అభిరుచులకు అనుగుణంగా తక్కువ ధరల్లో విభిన్న రకాల వస్త్రాలు అందుబాటులో ఉండటం గరుడ వస్త్ర సిల్క్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఒకే చోట ఎన్నో రకాల డిజైన్లు, వివిధ రంగులు, ఆకట్టుకునే వస్త్రాలు లభిస్తుండటంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు. పండుగలు, శుభకార్యాలు, రోజువారీ అవసరాలకు తగిన వస్త్రాలను ఎంపిక చేసుకుంటున్నారు.

ఐదు జిల్లాల్లో పెరుగుతున్న ఆదరణ!

జమ్మికుంటకు దూర ప్రాంతాల నుంచి సైతం మహిళలు వస్త్రాల కొనుగోలుకు వస్తుండటం గరుడ వస్త్ర సిల్క్‌కు లభిస్తున్న ఆదరణను తెలియజేస్తోందని స్థానికంగా చర్చ సాగుతోంది. తక్కువ ధరల్లో ఎక్కువ వెరైటీ లభిస్తుండటమే తమను ఆకర్షిస్తోందని కొనుగోలుదారులు చెబుతున్నారు.

కస్టమర్ల ఆదరణే మా బలం: మేనేజర్ నరేష్

ఈ సందర్భంగా గరుడ వస్త్ర సిల్క్ జమ్మికుంట శాఖ మేనేజర్ ధోని నరేష్ మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండేలా, నాణ్యమైన వస్త్రాలు అందుబాటు ధరల్లో అందించడమే తమ లక్ష్యమన్నారు. మహిళల అభిరుచులకు అనుగుణంగా నూతన డిజైన్లతో కూడిన వస్త్రాలను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. కొనుగోలుదారుల నుంచి వస్తున్న ఆదరణ, ఊహించని అమ్మకాలు తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.తక్కువ ధర.. నచ్చిన డిజైన్.. నాణ్యమైన వస్త్రం.. ఇదే గరుడ వస్త్ర సిల్క్ ప్రత్యేకతగా నిలుస్తోందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

అర్హులకు అన్యాయం.. అనర్హులకు అందలం!

రైతు సంఘాల్లో నిధుల గోల్‌మాల్?

హైదరాబాద్, జోర్దార్ ప్రతినిధి

1. పర్యవేక్షణ పూర్తిగా విఫలం

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాల నిర్వహణ తీవ్ర విమర్శలకు గురవుతోంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన ముఖ్య సంచాలకురాలు కార్యాలయానికే పరిమితమై కేవలం ఆదేశాలు జారీ చేయడంతో అక్రమాలు పెరిగిపోతున్నాయి.

2. ఒకే వ్యక్తికి రెండు ఉద్యోగాలు


జై జంగో జై లింగో రైతు ఉత్పత్తిదారుల సంఘం, జైనూర్ కు ప్రధాన కార్యనిర్వహణ అధికారిగా ఎంపికైన వ్యక్తి అదే సమయంలో నార్నూర్ నమూనా పాఠశాలలో వృత్తి విద్యా ఉపాధ్యాయుడిగా కూడా కొనసాగుతున్నారు. ఒక వ్యక్తి రెండు బాధ్యతలు ఎలా చేస్తారు? ఇది పర్యవేక్షణ వైఫల్యం కాదా?

3. యాదాద్రి సంఘంలో పాలక మండలి నిధుల స్వాహా

యాదాద్రి రైతు ఉత్పత్తిదారుల సంఘంలో ఒక్కో పాలక మండలి సభ్యుడు ఐదు వేలు, పది వేల చొప్పున తమ ఖాతాల్లో జమ చేయించుకుని సుమారు ఐదు లక్షల రూపాయల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం ఉంది. ఈ వ్యవహారంపై పర్యవేక్షణ సంచాలకురాలు ఏం చర్య తీసుకున్నారు?

4. విద్యార్హతల నిబంధనల ఉల్లంఘన

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రధాన అధికారి ఆదేశాల ప్రకారం వ్యవసాయ పట్టభద్రులను ప్రధాన కార్యనిర్వహణ అధికారులుగా తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా, ఇటీవల ఇంటర్మీడియట్ చదివిన వారిని కూడా నియమించారు. ఇప్పుడు వారిని తొలగిస్తామనడం ఆదేశాలను బేఖాతరు చేసినట్లే.



5. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ లలో అర్హులకు అన్యాయం

ఆసిఫాబాద్ లో కేవలం రెండు లక్షల వ్యాపారం కూడా చేయని, వ్యవసాయ పట్టా లేని వ్యక్తిని ఎంపిక చేశారు. అదే సమయంలో ఆదిలాబాద్ లో ఆదివాసీ రైతుల కోసం రోగనిరోధక శక్తి పెంచే గోధుమ విత్తనాల పంపిణీ వంటి వినూత్న వ్యాపారం చేసి నలభై లక్షల వ్యాపారం చేసిన వ్యవసాయ పట్టభద్రుడిని రాజకీయ కారణాలు చూపి తొలగించారు. అతనికి ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు.

6. ధాన్యం సేకరణ కేంద్రాల్లో లక్షల దండుకోవడం

ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఒక్కో ప్రధాన కార్యనిర్వహణ అధికారి ద్వారా సుమారు ఐదు లక్షల రూపాయల వరకు అక్రమ సంపాదన జరుగుతుండగా, అందులో పర్యవేక్షణ సంచాలకురాలికి వాటా అందిన కారణంగానే కొందరిని ఎంపిక చేసి ఎంపిక చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

7. స్థానికులను కాదని దూరప్రాంతాల వారి ఎంపిక

ఉట్నూర్ సంఘానికి స్థానికులను కాకుండా గుడిహత్నూర్ నుండి ముప్పై ఐదు కిలోమీటర్ల దూరం నుండి, కొండాపూర్ సంఘానికి మియాపూర్ నుండి నలభై ఐదు కిలోమీటర్ల దూరం నుండి, కరీంనగర్ జిల్లా సైదాపూర్ కు అవకాశం ఇవ్వకుండా చిట్యాల, టేకుమట్ల ప్రాంతాల నుండి నలభై కిలోమీటర్ల దూరం నుండి అభ్యర్థులను ఎంపిక చేశారు. గతంలో స్వయం సహాయక సంఘ సభ్యుల కుటుంబ సభ్యులు, స్థానికులు, పాలక మండలి సమక్షంలో ఎంపిక జరిగేది. ఇప్పుడు పాలక మండలి ప్రమేయం లేకుండా ఎంపిక జరగడంతో వాటాదారులకు విలువ లేకుండా చేశారు. ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.

8. ఖమ్మం మరియు బెనిషన్ కంపెనీ వ్యవహారం

ఖమ్మం ప్రధాన కార్యనిర్వహణ అధికారి బెనిషన్ అనే కంపెనీ వ్యాపార వ్యవహారాలపై ప్రశ్నించి ఘర్షణకు దిగితే చర్యలు తీసుకోకుండా అదే అధికారిని మళ్ళీ ఎంపిక చేశారు. క్రమశిక్షణ చర్యలు ఎందుకు లేవు?

9. రైతుల డబ్బులను కాజేసే కుట్ర – ప్రైవేటు సంస్థలతో లోపాయికారి ఒప్పందం

బెనిషన్ కంపెనీ ద్వారా రైతుల డబ్బులను కాజేసే వ్యూహంలో భాగంగా నిజాయితీగా పనిచేసే, ఆర్థిక వ్యవహారాలను ప్రశ్నించే ప్రధాన కార్యనిర్వహణ అధికారులపై నిందలు వేసి తొలగించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి సంఘానికి మార్కెటింగ్ చేసి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా కోట్ల రూపాయల రైతుల డబ్బులు ఇవ్వకుండా అవకతవకలకు పాల్పడితే పర్యవేక్షణ సంచాలకురాలు మౌనంగా ఉండటం వెనుక లోపాయికారి ఒప్పందం ఉందనే అనుమానం వ్యక్తమవుతోంది.

10. గుడిహత్నూర్ లో యాభై లక్షల గోల్ మాల్ మరియు ఆదివాసీల పట్ల వివక్ష

గుడిహత్నూర్ సంఘంలో రైతులకు సంబంధించిన సుమారు యాభై లక్షల రూపాయల నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించినందుకు, అత్యంత వెనుకబడిన ఆదివాసీ ప్రత్యేక తెగల వర్గాలకు జీవనోపాధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయకుండా వివక్ష చూపుతున్నారని ప్రశ్నించినందుకు సంబంధిత ప్రధాన కార్యనిర్వహణ అధికారిని తొలగించారు.అదేవిధంగా ప్రభుత్వ హైమెండార్ఫ్ సంఘానికి పత్తి నొక్కే యూనిట్ కేటాయించకుండా ప్రైవేటు స్వచ్ఛంద సంస్థకు ఇవ్వడం పై ప్రశ్నిస్తే ప్రధాన అధికారి ఆదేశాలతోనే ఇస్తున్నామని సమావేశంలో చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రభుత్వ సంఘానికే యూనిట్ ఇవ్వాలని ప్రశ్నించిన ఉట్నూర్ సంఘ అధికారిపై వ్యక్తిగత కక్ష పెంచుకుని, అర్హత ఉన్న వ్యక్తిని ఎంపిక కాకుండా చేసి, చివరికి ఉట్నూర్ హైమెండార్ఫ్ పేరును గాదిగూడ హైమెండార్ఫ్ గా మార్చి ఫలితాలు ప్రకటించడం ద్వారా దురుద్దేశం బయటపడుతోంది.

11. కామారెడ్డి నియామకంలో డబ్బుల వ్యవహారం

కామారెడ్డి ప్రధాన కార్యనిర్వహణ అధికారి ఇంటర్వ్యూ ఎంపిక వ్యవహారంలో డబ్బుల లావాదేవీలకు సంబంధించి ఇంటర్వ్యూ నిర్వహించిన సిబ్బందిలో కొందరు మధ్యవర్తులుగా వ్యవహరించి అవినీతికి పాల్పడ్డారు. డబ్బులు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పిన సంభాషణల రికార్డులు ఉన్నాయి.

12. ముగింపు

పర్యవేక్షణ సంచాలకురాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకుండా, సంఘాలకు లాభాలు వచ్చేలా ప్రయత్నించకుండా, తన మాట వినని పాలక మండలి సభ్యులను బెదిరించిన సందర్భాలు ఉన్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. అందువల్ల ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, పర్యవేక్షణ లో విఫలమైన సంచాలకురాలిని ఉద్యోగం నుండి తొలగించి, అర్హులైన స్థానిక వ్యవసాయ పట్టభద్రులకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సంపాదకీయం



సీఈసీపై సమరం.. ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం!

● ఎన్నికల సంఘం విశ్వసనీయతపై పెరుగుతున్న ప్రశ్నలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విపక్షాల పోరాటం ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిదీ


స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది. ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కును రాజ్యాంగం కల్పించింది. ఈ హక్కుకు భంగం కలగకుండా చూడాల్సిన అత్యంత కీలకమైన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. కానీ ప్రస్తుతం దేశంలో ఎన్నికల సంఘం పనితీరు, ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహారశైలిపై రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ)పై విపక్షాల పోరాటం మరింత ఉధృతమవుతోంది.ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో ఆదివారం నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభ విపక్షాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్‌తో చేపట్టిన ఈ ఆందోళన కేవలం ఒక వ్యక్తికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం మాత్రమే కాదు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్న విపక్షాల డిమాండ్‌కు ప్రతిరూపంగా నిలిచింది. ఈ ఉద్యమం ద్వారా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపైనా విపక్షాలు రాజకీయ ఒత్తిడి పెంచుతున్నాయి.**ఓట్ల చోరీ అంశంతో రాజకీయ వేడి** రాహుల్‌గాంధీ మొదటి నుంచీ ఓట్ల చోరీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు. తొలుత సొంత పార్టీలోని కొందరు నాయకులు ఈ అంశం ప్రజలను అంతగా ఆకట్టుకుంటుందా అనే సందేహాలు వ్యక్తం చేసినప్పటికీ, ఆయన మాత్రం వెనక్కి తగ్గకుండా ప్రచారాన్ని కొనసాగించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో లోపాలు, వివాదాలు వెలుగులోకి రావడంతో ఈ అంశానికి మరింత ప్రాధాన్యం పెరిగింది. ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయన్న ఆరోపణలు కూడా చర్చకు దారితీశాయి.**విపక్షాల ఐక్యతకు కొత్త వేదిక**రామ్‌లీలా మైదానంలో జరిగిన సభ ఇండియా కూటమి పార్టీలకు ఐక్యంగా పోరాడేందుకు ఒక వేదికగా మారింది. గతంలో పరస్పర విభేదాలున్న పార్టీలు సైతం ఈ అంశంపై కలిసివచ్చే పరిస్థితి ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ కూడా కూటమిలో బలమైన భాగస్వామిగా ముందుకు రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఒడిశాలోని బిజూ జనతాదళ్ ఇండియా కూటమిలో లేకపోయినా ఢిల్లీ నిరసన కార్యక్రమంలో పాల్గొనడం గమనార్హం. అయితే కూటమిలో కీలక భాగస్వామి అయిన డీఎంకే ఈ ఆందోళనకు దూరంగా ఉండటం విపక్షాల మధ్య ఇంకా కొన్ని విభేదాలు ఉన్నాయని స్పష్టం చేస్తోంది.**సీట్ల సర్దుబాటే అసలైన సవాల్**విపక్షాలు ఐక్యంగా సమావేశాలు నిర్వహించడం, నిరసనలు చేపట్టడం ఒక ఎత్తయితే, ఎన్నికల సమయంలో ఐక్యతను కొనసాగించడం మరో ఎత్తు. ముఖ్యంగా రాష్ట్రాల వారీగా సీట్ల పంపకాల్లో ప్రాంతీయ పార్టీల ప్రయోజనాలు, కాంగ్రెస్ నాయకుల వ్యక్తిగత ఆకాంక్షలకు ప్రాధాన్యం ఇవ్వకుండా విజయమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలి. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని ఇండియా కూటమి భావిస్తోంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ సాధించిన విజయాలు అక్కడ బలమైన ప్రతిపక్ష కూటమి ఏర్పాటుకు అవకాశాలను పెంచాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం కాంగ్రెస్‌తో పాటు మిత్రపక్షాల ముందున్న కీలక బాధ్యత. **ఓటు హక్కు బలహీనపడకూడదు**భారత రాజ్యాంగం ప్రతి వయోజన పౌరుడికి ఓటు హక్కును కల్పించింది. కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి ఓటుకు సమాన విలువ ఉండాలన్నదే ప్రజాస్వామ్య స్ఫూర్తి. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే పరిస్థితులు ఏర్పడితే అది ప్రజాస్వామ్య మూల సూత్రాలకే విఘాతం కలిగించినట్లవుతుంది. ఎన్నికల సంఘం తన అధికార పరిధిని దాటి కొత్త నిబంధనలు లేదా విధానాల ద్వారా ఓటర్ల హక్కులకు భంగం కలిగించకూడదన్నది విపక్షాల ప్రధాన వాదన. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి అన్యాయంగా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది.**జవాబుదారీతనమే ప్రజాస్వామ్యానికి రక్షణ**ఎన్నికల ప్రక్రియలో ఏవైనా తప్పిదాలు జరిగితే వాటిపై సమగ్ర విచారణ జరగాలి. బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందన్న నమ్మకం ప్రజల్లో నిలవాలి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవిలో కొనసాగడం, రాజీనామా చేయడం కంటే ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కాపాడటం మరింత ముఖ్యం.ప్రజాస్వామ్యం అనేది కేవలం ఎన్నికలు నిర్వహించడంతో పూర్తయ్యేది కాదు. ప్రతి పౌరుడి ఓటుకు విలువ ఉండాలి. ప్రజల తీర్పు ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ప్రతిఫలించాలి. అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ఎన్నికల వ్యవస్థ



పరిహారం పక్కదారి.. ఉద్యోగికి తిరిగి కొలువు! కరీంనగర్ విద్యుత్ శాఖలో ఇదేం వ్యవహారం?

కరీంనగర్, జోర్దార్ ప్రతినిధి

కరీంనగర్ విద్యుత్ శాఖలో రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా వ్యవ హారం పలు అనుమానాలకు తావిస్తోంది. విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి అందాల్సిన పరిహారం నిబం ధనలకు విరుద్ధంగా మరో వ్యక్తి ఖాతాలోకి వెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న ఉద్యోగిపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేసినట్లు సమాచారం. అయితే కొంతకాలానికే అదే ఉద్యోగికి తిరిగి పోస్టింగ్ లభించిందనే ప్రచారం ఇప్పుడు శాఖలో చర్చనీయాంశంగా మారింది.



రూ.5 లక్షల పరిహారం ఎటు వెళ్లింది?

విద్యుత్ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందడంతో నిబంధనల ప్రకారం ఆయన కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందాల్సి ఉంది. అయితే ఆ మొత్తాన్ని అసలు లబ్ధిదారులకు కాకుండా మరో వ్యక్తి పేరుతో చెక్కు ద్వారా చెల్లించి, సంబంధిత మొత్తాన్ని అతడి బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆ డబ్బును సంబంధిత వ్యక్తులు వినియో గించుకున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది.

ఈ చెల్లింపుపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఉన్నతాధికారుల దృష్టికి విషయం వెళ్లినట్లు తెలుస్తోంది. అనంతరం శాఖాపరమైన విచారణ చేపట్టి, నిధుల చెల్లింపు ప్రక్రియలో అవకతవకలు జరి గాయనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత ఉద్యోగిని సస్పెండ్ చేసినట్లు సమాచారం. ప్రభుత్వ నిధుల వ్యవహారంలో వివరణ కోరుతూ షోకాజ్ నోటీసు కూడా జారీ చేసినట్లు తెలిసింది.

సస్పెన్షన్ తర్వాత మొదలైన పైరవీలు?

ఉద్యోగిపై చర్యలు తీసుకున్న అనంతరం తిరిగి విధుల్లో చేరేందుకు రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తుల ద్వారా ప్రయత్నాలు జరిగాయనే ప్రచారం మొదలైంది. ఉద్యోగానికి తిరిగి అవకాశం కల్పించేందుకు ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు పలుమారు వెళ్లి ఉన్నతాధికారులను కలిసినట్లు సమాచారం. శాఖాపరమైన మార్గంలో ప్రయత్నాలు ఫలించకపోవడంతో రాజకీయ స్థాయిలో పైరవీలు జరిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలను అధికారికంగా ధ్రువీకరించే సమాచారం ఇప్పటివరకు వెలువడలేదు.

చివరకు మళ్లీ పోస్టింగ్!

సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగికి అనంతరం ఉమ్మడి వరంగల్ ప్రాంతంలో తిరిగి పోస్టింగ్ లభించినట్లు సమాచారం. దీంతో శాఖలో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిధుల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిపై శాఖాపరమైన విచారణ ఏ దశలో ఉంది? విచారణ పూర్తయిందా? ఆరోపణలు నిరాధారమని తేలిందా? లేక ఇతర కారణాలతో తిరిగి పోస్టింగ్ ఇచ్చారా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

పోస్టింగ్ తర్వాత మరో పంచాయితీ?

ఉద్యోగికి తిరిగి పోస్టింగ్ వచ్చిన తర్వాత ఈ వ్యవహారం మరో మలుపు తిరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఉద్యోగాన్ని తిరిగి ఇప్పించేందుకు మధ్యవర్తిత్వం చేసినట్లు చెప్పుకుంటున్న వ్యక్తులు, సంబంధిత ఉద్యోగి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో విభే దాలు తలెత్తినట్లు సమాచారం.తమకు రావాల్సిన మొత్తం అంద లేదని కొందరు ప్రశ్నించగా, ఒకరికి తెలియకుండా మరొకరు డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు కూడా వినిపించినట్లు ప్రచా రం. దీంతో వ్యక్తిగతంగా మొదలైన వివాదం చివరకు పంచా యితీ వరకు వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అధికారులపై ఒత్తిళ్లు వచ్చాయా?

ఈ వ్యవహారంలో రాజకీయ జోక్యం జరిగిందనే ఆరోపణలే ఇప్పుడు ప్రధాన చర్చగా మారాయి. బదిలీలు, పోస్టింగులు, సస్పెన్షన్లు, తిరిగి విధుల్లోకి తీసుకోవడం వంటి శాఖాపరమైన అంశాల్లో రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తులు జోక్యం చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.అయితే సంబంధిత వ్యక్తులపై వస్తున్న ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ లేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల వివరణ వెలువడితేనే వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

బాధిత కుటుంబానికి న్యాయం జరిగిందా?

ఈ మొత్తం వ్యవహారంలో అసలు ప్రశ్న మాత్రం బాధిత కుటు ంబానిదే. విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి అందాల్సిన రూ.5 లక్షల పరిహారం చివరకు వారికి చేరిందా? లేక మరో వ్యక్తి ఖాతాలోకి వెళ్లిందా? నిధుల చెల్లింపులో ఎవరి పాత్ర ఉంది? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

అదేవిధంగా ఆరోపణలు ఎదుర్కొన్న ఉద్యోగికి తిరిగి పోస్టింగ్ ఇవ్వడానికి శాఖాపరమైన కారణాలేమిటి? రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా పనిచేశాయా? అన్న అంశాలపై కూడా సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

సమగ్ర విచారణకు డిమాండ్

రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు నుంచి ఉద్యోగి సస్పెన్షన్, అనంతరం తిరిగి పోస్టింగ్ వరకు జరిగిన ప్రతి పరిణామాన్ని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. పరిహారం నిజమైన లబ్ధిదారుడికి చేరిందా లేదా అన్నది తేల్చడంతో పాటు, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదే సమయంలో ఉద్యోగికి తిరిగి పోస్టింగ్ కల్పించిన నిర్ణయంపై కూడా స్పష్టత ఇవ్వాలని, రాజకీయ పైరవీలు లేదా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై వాస్తవాలను వెలుగులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

కల్వకుంటలో ఉచిత మెగా వైద్య శిబిరం



మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 03

నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంటలో మంగళవారం వైభవ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్యం హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్‌తో పాటు గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించిన ఆర్వీఎం హాస్పిటల్ యాజమాన్యానికి క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైభవ్ ఫ్రెండ్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు కొండల్ రెడ్డి, అధ్యక్షులు మసూద్ అలీ, కార్యదర్శి మాధవరెడ్డి, కోశాధికారి పందిరి రవీందర్, దొడ్డ రాజు, టి. బాపురెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ లక్ష్మణ్, వైద్యులు భవిత, ప్రశాంత్, హర్షిత, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం ఫారం--18 అందజేత...

ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో పాటు సిబ్బందికి ఫారాలు పంపిణీ....



వనపర్తి బ్యూరో నవంబర్ 3 హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని ఏఐపీసీ, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐపీసీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు జి. నాగార్జున, ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు ఎత్తం చరణ్‌రాజ్ ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ కార్యాలయాన్ని సందర్శించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరిమళతో పాటు కార్యాలయ సిబ్బందికి ఫారం--18 అందజేశారు.ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులందరూ ఫారం--18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు కోరారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డికి మద్దతుగా పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, పుట్ట బాలరాజు, కుమార్, రాజు, రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

రైతు చేతిలోనే నెల ఆరోగ్యం.. పాలెం కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైల



బిజినాపల్లి నవంబర్ 3. ఇతర పంటలు పంట మార్పిడి యజమాన్యం వంటి పద్ధతులతోనే నేల ఆరోగ్యానికి వాడుకోవచ్చునని ముఖ్యంగా నేల ఆరోగ్య రైతు చేతుల్లోనే ఉందని పాలెం కేవీకే ఓ సైలా అన్నారు మరి సాగు తర్వాత చిరుధాన్యాల సాగును చేపట్టినట్లయితే చాలా ఆరోగ్యంగా ఉంటుందని అందమైన యజమాన్య పద్ధతులు చేపట్టాలన్నారు మంగళవారం మండలంలోని పాలెం కేవీకే ప్రాంగణంలో నేల సంపూర్ణ ప్రచార కార్యక్రమపై రైతులు అవగాహన సదస్సు నిర్వహించారు డాక్టర్ చిరంజీవి డాక్టర్ వి దివ్యరాణిలు మాట్లాడుతూ నెలల్లో కృత్తిమ పెరుగు బదులుగా సేంద్రియ ఎరువు ఉపయోగించాలి భూసార పరీక్షల అనంతరం అధికారులు సూచించిన మేర మాత్రమె కృత్రిమ ఎరువు వాడాలన్నారు వేసవిలో నేలను లోతుగా కలియ దున్నాలని పంట నష్టాలను పొలంలో కాల్చరాదని అన్నారు సదస్సు 45 మంది రైతులు పాల్గొన్నారు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో రిజర్వాయర్ల నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు.

పాలమూరు అంతులేని నిర్లక్ష్యం చేయడం వల్లే నేడు రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. 10 టీఎంసీల సామర్థ్యమున్న జూరాల ద్వారా 5.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. 22 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీరంగాపురం రిజర్వాయర్‌కు వెళ్లే కాలువకు బీఆర్ఎస్ సర్కారు మరమ్మతు చేసి ఉంటే 20 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందేవని గుర్తుచేశారు.ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా కేసీఆర్ పెడచెవిన పెట్టారన్నారు. లక్షల కోట్లు అప్పు చేసి కుడా జూరాల కింద గట్టు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్లు నిర్మించలేదని ధ్వజమెత్తారు. ఈ రెండు రిజర్వాయర్లు నిర్మించి ఉంటే నేడు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని వివరించారు.కల్వకుర్తి లిఫ్ట్ కింద 20 టీఎంసీల రిజర్వాయర్ నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చ్ఞశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 15 టీఎంసీల సామర్థ్యంతో గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు...

కరీంనగర్ పౌర సరఫరాల శాఖలో విజిలెన్స్ కలకలం

: పౌరసరపరల అధికారి నర్సింగరావు అక్రమాలపై ముమ్మర విచారణ

కరీంనగర్ (జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి):

కరీంనగర్ జిల్లా పౌర సరఫరాల అధికారి నర్సింగరావుపై వచ్చిన తీవ్ర అవినీతి, అక్రమాల ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం విచారణ వేగవంతం చేశాయి. గత కొన్ని నెలల క్రితం ఫిర్యాదుదారుడు బోల్ల వేణుగోపాల్ కరీంనగర్ జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులకు అందించిన లేఖలోని అంశాల ఆధారంగా మరియు విజిలెన్స్ అధికారులకు ఇచ్చిన పిర్యాదు ఆధారంగా విచారణ ప్రక్రియ తీవ్రరూపం దాల్చింది.ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారునికి ఫోన్ ద్వారా సమాచారం అందించి విచారణకు హాజరుకావాలని అధికారులు కోరినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి రంగంలోకి దిగిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఉన్నతాధికారుల బృందం, కరీంనగర్ జిల్లా పౌర సరఫరాల కార్యాలయంలో మధ్యాహ్నం 12:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు సుదీర్ఘంగా తనిఖీలు చేపట్టింది. ఈూా నర్సింగరావును అధికారులు నేరుగా విచారించి పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.




ఫిర్యాదులో వెలుగుచూసిన ప్రధాన ఆరోపణలు అక్రమాలు:

సన్న బియ్యం బ్లాక్ మార్కెట్ తరలింపు: ప్రభుత్వం పేదలకు అందించాల్సిన సన్న బియ్యాన్ని మిల్లులతో కుమ్మక్కై బ్లాక్ మార్కెట్‌కు తరలించి, వాటి స్థానంలో నాసిరకం లావు/దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐ కి పంపించడంలో కీలక పాత్ర పోషించారని ఆరోపించారు.ప్రభుత్వ నిబంధనలు కమీషనర్ ఆదేశాల ఉల్లంఘన: మాజీ సివిల్ సప్లైస్ కమీషనర్ చౌహాన్ ఆదేశాలను పక్కనబెట్టి, టెండర్ ప్యాడీ బకాయిలు ఉన్న మిల్లులకు మరియు విజిలెన్స్ నివేదికల (2024-25 ఖరీఫ్/రబీ) ప్రకారం ధాన్యం నిల్వలు లేవని తేలిన మిల్లులకు కూడా నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కేటాయించారు.రూ. 5 కోట్ల ధాన్యం కాజేత - డబుల్ షిఫ్టింగ్ నాటకం: మిల్లుల్లో భౌతికంగా ధాన్యం లేకపోయినా 25% పెనాల్టీ పడకుండా ఉండటానికి "డబుల్ షిఫ్టింగ్" పేరుతో ఒక మిల్లు నుండి ఇంకో మిల్లుకు ధాన్యం తరలించినట్లు తప్పుడు రికార్డులు సృష్టించి, సుమారు ?5 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యాన్ని కాజేయడానికి డి ఎస్ఓ సూత్రధారిగా వ్యవహరించారనే అభియోగాలు ఉన్నాయి.సార్టెక్స్ యంత్రాల నిబంధనల ఉల్లంఘన: సార్టెక్స్ మరియు బ్లాండింగ్ యంత్రాలు లేని మిల్లులకు కేటాయింపులు నిలిపివేయాల్సి ఉండగా, లంచాలకు లొంగి కేటాయింపులు జరిపి అర్హత ఉన్న మిల్లులను వేధింపులకు గురిచేశారు.2025-26 ఖరీఫ్‌లో నిల్వలు లేని 13 మిల్లులకు కేటాయింపులు: ఖరీఫ్ సీజన్‌లో భౌతికంగా ధాన్యం నిల్వలు లేకున్నా 13 మంది మిల్లర్లకు నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా కేటాయింపులు చేశారని

రంగుల లేపనం

ఉదయాన్నే తోటలో అడుగుపెట్టాను
పూలకున్న రంగులన్నీ మాయం
అర్థంకాక ఆకాశంవైపు చూశాను
కాలుష్యంతో కాలిపోతున్న ఇంద్రధనస్సు
పూలరంగుల్ని లేపనంగా రాసుకుంటూ

ఆకాశానికి చికిత్స
వాడెవడో ఆకాశాన్ని కిందికి దించి
కసిగా ముక్కలుగా నరికేస్తున్నాడు
గాయపడ్డ సూర్యచంద్రులకు చికిత్స
ఎక్కడోకాదు ఏకంగా మా ఇంట్లోనే
నా వైద్యానికి అక్షరాలే మూలికలవుతూ



'సాహిత్య ప్రపూర్ణ' డాక్టర్ కె.జి. వేణు
98480 70084

పోలవరం జెడ్పీ పీఠం ఎవరికి?

రేసులో చింతూరు వైపు నుంచి సంకేతాలు!

జోర్దార్ న్యూస్. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బ్యూరో:పోలవరం జిల్లా రాజకీయాల్లో జెడ్పీ చైర్మన్ పీఠం ఇప్పుడు తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 జెడ్పీటీసీ స్థానాలకు పోరు హోరాహోరీగా సాగుతుండగా, కైవసం చేసుకునే ఫలితాలపై ఇప్పటినుంచే లెక్కలు మొదలయ్యాయి. కూటమి మెజారిటీ స్థానాలు గెలిస్తే జెడ్పీ పీఠాన్ని అధిరోహించేది ఎవరనే చర్చ రాజకీయ వర్గాల్లో వేడెక్కిస్తోంది.

కూటమిలో కీలక అభ్యర్థి వైపే మొగ్గు..?

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, కూటమి నాయకత్వం చింతూరు నుంచి పోటీలో ఉన్న కీలక అభ్యర్థి వైపే మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా కూటమి ఒప్పందంలో భాగంగా జనసేన తరఫున రేసులో ఉండి, స్థానికంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్న వీర మహిళా నేత వైపే అధిష్టానాల చూపు ఉందనే చర్చ నడుస్తోంది. ప్రజల్లో మంచి ఆదరణ ఉండి, నియోజకవర్గ సమస్యలపై నిరంతరం పోరాడే ఆ నాయకురాలికి అవకాశం ఇస్తే జిల్లా వ్యాప్తంగా పార్టీ పట్టు మరిన్ని రెట్లు బలపడుతుందని అధినాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం.

12 స్థానాల్లో కూటమి లెక్క చూస్తే -- టీడీపీ 7, జనసేన 4, బీజేపీ 1 చొప్పున బరిలో ఉన్నాయి. మెజారిటీ మార్క్ దాటితే జెడ్పీ పీఠం చింతూరు నుంచి దూకుడుగా దూసుకెళ్తున్న ఆ ప్రముఖ మహిళా అభ్యర్థినే వరిస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

గంటల వ్యవధిలోనే తల్లీకొడుకుల మృతి

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్‌లోని శాంతి నగర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గంటల వ్యవధిలోనే తల్లీ కొడుకు కన్నుమూశారు. స్థానికుల సమాచారం ప్రకారం కాలనీకి చెందిన సయ్యద్ హుస్సేన్ (60) అనారోగ్యంతో బాధ పడుతుండగా, మంగళవారం తెల్లవారుజామున రిమ్స్‌లో కుమారుడు మృతిచెందాడు. కొడుకు మరణవార్త విని మనోవేదనతో తల్లి హస్మత్ (85) ఉదయం తుదిశ్వాస విడిచారు. ఒకేసారి ఇద్దరూ ప్రాణాలు కోల్పోవడంతో శాంతి నగర్‌లో శోక



సంద్రం అలముకుంది.

రాజాపూర్ ప్రజలకు అండగా ఉంటా

నష్టం జరిగితే సహించేది లేదు!

- సింగరేణి, రెవెన్యూ అధికారుల తీరుపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆగ్రహం
- ఆర్‌టీఎచ్, ఆర్‌పీఎన్ పేరుతో పరిహారంలో వివక్ష చూపుతున్నారని గ్రామస్థుల ఆవేదన


రామగిరి జోర్దార్ ప్రతినిధి:సింగరేణి బొగ్గు గనుల విస్తరణతో ప్రభావితమవుతున్న రాజాపూర్ గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తానని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ భరోసా ఇచ్చారు. సింగరేణి సంస్థ, రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్, సంబంధిత మంత్రి స్థాయిలో ఎవరి వల్ల గ్రామ ప్రజలకు అన్యాయం జరిగినా చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రజలకు నష్టం కలిగించే ఏ చర్యనూ సహించబోనని, బాధితుల పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడతానని హామీ ఇచ్చారు

మూడేళ్లుగా పరిష్కారం కాని సమస్యలు

రామగిరి మండలంలోని సింగరేణి ప్రభావిత గ్రామమైన రాజాపూర్‌కు చెందిన ప్రజలు తమ సమస్యలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాన్ని సందర్శించి క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని కోరుతూ తమ ఇబ్బందులను వివరించారు. గత మూడు సంవత్సరాలుగా గ్రామ సమస్యలను పరిష్కరించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పష్టమైన పరిష్కారం లభించడం లేదని వాపోయారు.

పరిహారంలో రెండు వర్గాలుగా విభజన?

ఆర్‌టీఎచ్, ఆర్‌పీఎన్ పేరుతో గ్రామంలోని ఇళ్లను రెండు వర్గాలుగా విభజించి పరిహారం చెల్లించే విషయంలో వివక్ష చూపుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ఒకే గ్రామంలో నివసిస్తున్న ప్రజల



మధ్య పరిహారం విషయంలో తేడాలు చూపడం ఏమిటని ప్రశ్నించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిహారం నిర్ణయంలో పారదర్శకత పాటించాలని, ఎలాంటి అన్యాయానికి తావులేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

బ్లాస్టింగ్‌లతో ఇళ్లకు నష్టం.. ప్రజల్లో భయాందోళనలు

సింగరేణి బొగ్గు గనుల్లో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్‌ల కారణంగా గ్రామంలో దుమ్ము, ధూళి విపరీతంగా వ్యాపిస్తోందని, భారీ శబ్దాలతో ఇళ్లు దెబ్బతింటున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాస్టింగ్‌ల సమయంలో ఇళ్లలో ప్రకంపనలు వస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. గనుల కార్యకలాపాల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇళ్లకు జరుగుతున్న నష్టాన్ని అంచనా వేసి బాధితులకు తగిన పరిహారం అందించాలని కోరారు.

గతంలో సమస్యల పరిష్కారానికి కృషి చేశా

ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ గతంలో తమ ప్రభుత్వ హయాంలో సింగరేణి సీఎండీతో నేరుగా మాట్లాడి పలు ప్రభావిత గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు గుర్తుచేశారు. ప్రజల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపినట్లు తెలిపారు. ఇప్పుడు రాజాపూర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.గ్రామస్థులు ఎదుర్కొంటున్న పరిహారం, బ్లాస్టింగ్‌ల వల్ల కలుగుతున్న నష్టం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని, అధికారులు బాధ్యతగా స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని పుట్ట మధూకర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాశం ఓదెలు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుల్లెల కిరణ్, గ్రామశాఖ అధ్యక్షుడు కాదాసి రమేష్, కలవేన రమేష్, కలవేన సదానందం, మల్లేష్, పొట్ల సతీష్, మాజీ ఉప సర్పంచ్ కలవేన సంపత్, నూనెటి లింగయ్య, వేల్పుల ఆంజనేయులు, లక్కారం రాజయ్య, పుల్లెల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షల

పేరుతో అధిక వసూళ్లు!

- ఆస్పత్రులు, ల్యాబ్‌ల తనిఖీలకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- డీఎంహెచ్‌వో సాధన

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో వైద్య పరీక్షల పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ జ్వరంతో ఆస్పత్రులకు వెళ్లినా అవసరం లేని పరీక్షలు నిర్వహిస్తూ రోగులపై ఆర్థిక భారం మోపుతున్నారని



పలువురు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే కొన్ని ఆస్పత్రుల్లో మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వైద్య సేవల ఫీజుల విషయంలోనూ నిబంధనలు పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రిమ్స్ వైద్యులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపుతూ ప్రైవేట్ క్లినిక్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లను తనిఖీ చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో సాధన తెలిపారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రులు, ల్యాబ్‌లలో తనిఖీలు నిర్వహించి పరీక్షల ధరలు, వసూళ్ల వివరాలను సేకరిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే నివారించవచ్చు
- సర్పంచ్ రామంచ వెన్నెల దయాకర్

హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామంలో సర్పంచ్ రామంచ వెన్నెల దయాకర్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళల ఆరోగ్య వికాస్ అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే నివారించే అవకాశం ఉందన్నారు.మహిళలు వీఐఏ,



వీఐఎల్ఐ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ ముందస్తు లక్షణాలను గుర్తించవచ్చని తెలిపారు. అనుమానిత లక్షణాలు కనిపిస్తే కొల్పోస్కోపీ, బయాప్సీ వంటి తదుపరి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.మహిళలు ఎలాంటి భయం,సంకోచం లేకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి అనుష, ఉపసర్పంచ్ బండ దామోదర్ రెడ్డి,మహిళలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణుల ముందస్తు నమోదు ప్రక్రియను

పరిశీలించిన డీఎంహెచ్‌వో

హసన్ పర్తి,జోర్దార్ ప్రతినిధి:గర్భిణుల ముందస్తు నమోదు (ఏఎన్‌సీ) శాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య శ్యాంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గట్లకానపర్తి గ్రామాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత మూడు నెలలుగా నమోదు శాతం తక్కువగా ఉండటంతో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా గర్భిణుల నమోదు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గర్భిణిని మొదటి మూడు నెలల్లోనే గుర్తించి నమోదు చేయాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆశా, ఏఎన్ఎం సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి ఒక్క గర్భిణి కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా చూడాలన్నారు.



ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రజిత, పీహెచ్ఎన్ శోభ, హెల్త్ సూపర్‌వై జర్లు రమాదేవి, పద్మజ, ఎంపీహెచ్ఈఓలు సంపత్,భద్రయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు

బియ్యం అమ్మితే,కఠిన చర్యలు తీసుకుంటాం

- బియ్యం వ్యాపారులను హెచ్చరించిన జిల్లా కలెక్టర్, కుమార్ దీపక్.

మంచిర్యాల జోర్దార్ జిల్లా ప్రతినిధి:ఎల్ నినో ప్రభావంతో బియ్యం కొరత సృష్టిస్తూ, అధిక ధరలకు అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వ్యాపారులను హెచ్చరించారు.

మంగళవారం మంచిర్యాల పట్టణంలో శ్రీనాథ్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బియ్యం అమ్మకాల ఔట్ లెట్ షాపును జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కాకుండా, అధిక ధరలకు అమ్మినట్లయితే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. నిర్దేశించిన ధరలకు అమ్మకానికి గజానన్ ఇండస్ట్రీస్ వారు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.



ఎల్ నినో ప్రభావంతో బియ్యం వ్యాపారులు, ట్రేడర్స్ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ప్రజలకు బియ్యం సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిళల స్వయం ఉపాధికి ఎన్‌టీపీసీ చేయూత

మూడు నెలల బ్యూటీషియన్ శిక్షణకు ముగింపు



- నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మలుచుకోవాలి..
- మహిళలకు దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు తజీన్ జావేద్ పిలుపు

రామగుండం,జోర్దార్ ప్రతినిధి:మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఎన్‌టీపీసీ రామగుండం చేపట్టిన సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన మూడు నెలల బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమానికి ముగింపు వేడుక నిర్వహించారు. ఎన్‌టీపీసీ రామగుండం ఆధ్వర్యంలో దీప్తి మహిళా సమితి (డీఎంఎస్) సహకారంతో సాయి సేవా సమితి సమీపంలోని వృత్తి శిక్షణ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ముగింపు వేడుకకు దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు తజీన్ జావేద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను కేవలం సర్టిఫికెట్లకే పరిమితం చేయకుండా ఉపాధి అవకాశాలుగా మలుచుకోవాలని సూచించారు.వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని సొంతంగా ఆదాయం సంపాదించడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యతనిస్తూ ఎన్‌టీపీసీ సామాజిక బాధ్యత విభాగం, దీప్తి మహిళా సమితి భవిష్యత్తులోనూ ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తాయని తెలిపారు. అవసరాన్ని బట్టి ఉన్నత స్థాయి శిక్షణ కార్యక్రమాలను సైతం నిర్వహించి మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దీప్తి మహిళా సమితి సీనియర్ సభ్యులు, శిక్షణ పొందిన మహిళలు, ఎన్‌టీపీసీ సామాజిక బాధ్యత విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని మహిళలకు ప్రోత్సాహం అందించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, స్థిరమైన జీవనోపాధి కల్పన దిశగా ఎన్‌టీపీసీ రామగుండం తన సామాజిక బాధ్యతను కొనసాగిస్తోందని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

మురుసు తుఫాన్ ప్రభావంతో

ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:మురుసు తుఫాన్ ప్రభావంతో ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం భారీ వర్షం కురిసింది. గుడిహత్నూర్, ఇచోడ, బజార్ హత్నూర్, బోథ్ మండలాల్లో వర్షం తీవ్రత అధికంగా ఉంది. గత కొంతకాలంగా ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఉపశమనం లభించింది.

ఒక్కసారిగా కురిసిన వర్షంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఈఓ శోభారాణిని

సత్కరించిన దేశాయిపల్లి సర్పంచ్

(వీణవంక జోర్దార్ ప్రతినిధి)ఇండియా స్కూల్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్న మండల విద్యాధికారి ఎస్. శోభారాణికి దేశాయిపల్లి గ్రామంలో ఘన సన్మానం నిర్వహించారు.

దేశాయిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాసర్ల శ్రీనివాస్ ఆమెను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యారంగంలో విశేష సేవలందిస్తూ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకోవడం మండలానికే గర్వకారణమని పేర్కొన్నారు. ఆమె మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం. రాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పూదరి శ్రీనివాస్,ప్రధానోపాధ్యాయురాలు డి. తిరుమల, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు చింతలపూడి రమాదేవి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారం,క్రీడల్లో ప్రథమ స్థానం!

● జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇద్దరు ప్రతిభావంతులకు ఘన సన్మానం

జమ్మికుంట, జోర్దార్ ప్రతినిధి:జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభకు పట్టాభిషేకం జరిగింది. ఒకవైపు జాతీయస్థాయి విజయదశమి పురస్కారంతో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. కుమార్ గుర్తింపు పొందగా, మరోవైపు కళాశాల విద్యార్థి మల్లికార్జున్ జిల్లా స్థాయి హామర్ త్రో పోటీల్లో ప్రథమ స్థానం సాధించి కళాశాల కీర్తిని చాటాడు. ఈ రెండు విజయాలను పురస్కరించుకొని కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

జాతీయస్థాయి పురస్కారంతో ప్రిన్సిపాల్‌కు గుర్తింపు

సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఎం. కుమార్ చేసిన విశేష సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో జాతీయస్థాయి



విజయదశమి పురస్కారాన్ని స్వర్ణ కంకణంతో అందుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కళాశాలలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థి

కళాశాలకు చెందిన ఒకేషనల్ ప్రథమ సంవత్సరం ఎల్ఎం అండ్ డీటీ విద్యార్థి మల్లికార్జున్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో హామర్ త్రో విభాగంలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం. కుమార్, క్రీడల ఇన్‌చార్జి రమేష్ విద్యార్థిని ఘనంగా సన్మానించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం. కుమార్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు చదువుతో పాటు సాహిత్య, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరచడం గర్వకారణమన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి అధ్యాపకుల ప్రోత్సాహం, సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభాకర్, తిరుపతి, మహేష్, విశ్వనాథ్, శ్రీధర్, శ్రీనివాస్, ప్రసాద్, శివశంకర్, అధ్యాపకురాళ్లు జ్యోత్స్న, సీమ, ప్రగతి, అనూహ్య, హర్షిణితో పాటు కళాశాల అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని ప్రిన్సిపాల్ కుమార్, విద్యార్థి మల్లికార్జున్‌లను అభినందించారు.

రైతన్నలు కరువు పట్ల ఆలోచన చేయాలి

● సూపర్ ఎల్నినో ద్వారా కరువు..

● ప్రతిపక్షాల ఆరోపణలు నమ్మవద్దు..

● కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తోంది..

● రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు..

(పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి)పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు, కొత్తపల్లి, మూలసాల, బోజన్నపేట, హనుమంతునిపేట, మారేడుగొండ, గుర్రాంపల్లి, చీకురాయి గ్రామాల్లో మరియు పెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో, చందపల్లిలో ఐకేపీ సింగిల్ విండో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన గౌరవ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

సూపర్ ఎల్నినో కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజయరమణ రావు సూచించారు. కరువు పట్ల రైతన్నలు ఆలోచన చేయలని యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సమృద్ధిగా పండే మొక్కజొన్న (మక్కలు), శెనగ వంటి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు పంటలను సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దలారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకు మండలంలో ఐకేపీ మరియు సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. రైతు తన పంట అమ్మిన రెండు రోజుల్లోనే తన ఖాతాలో డబ్బులు జమ అవుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ఉందని ధాన్యం కొనుగోళ్ల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు మరియు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచనలు చేశారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు,రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె

భద్రాద్రి కొత్తగూడెం,జోర్దార్ ప్రతినిధి:కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు తెలిపారు. మంగళవారం దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం నుంచి రాత్రి వరకు విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు ప్రస్తుతం నెలకు రూ. 9,900 మాత్రమే చెల్లిస్తున్నారని, కనీసం రూ.18 వేల స్థిర వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు.



అలాగే పట్వరిగూడెంలోనూ ఆశా వర్కర్లు వైద్యాధికారి డాక్టర్ వెంకట ప్రవీణ్‌కు సమ్మె నోటీసు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట నిరాహార దీక్ష

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:వాళ్లిద్దరూ పదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి విషయం ప్రస్తావనకు రాగానే పట్టించుకోకపోవడంతో సదరు యువతి ప్రియుడి ఇంటి ఎదుట నిరాహార దీక్షకు దిగింది. అదిలాబాద్ జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన అక్షర, అదే గ్రామానికి చెందిన మహేందర్ 2017 నుంచి ప్రేమించుకుంటున్నారు. గతంలో పెళ్లి విషయం చర్చించగా, మైనర్లు కావడంతో వాయిదా వేసుకుంటూ వచ్చారు. విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో యువతి ఆదివారం రాత్రి మహేందర్ ఇంటికి వచ్చింది. ఆ సమయంలో అతను ఇంట్లో లేకపోవడం, అతని తల్లిదండ్రులు మాకేం తెలియదని చెప్పడంతో న్యాయం కోసం నిరాహార దీక్ష చేపట్టింది. సోమవారం గ్రామస్తులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. కానీ సమస్య పరిష్కారం కాకపోవడంతో సదరు యువతి మళ్లీ నిరాహార దీక్ష కొనసాగిస్తోంది




టీఆర్ఎస్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా పొన్నం శిరీష నియామకం

హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా హుజూరాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ నాయకురాలు పొన్నం శిరీష నియమితులయ్యారు.

ఇటీవల నిర్వహించిన పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా, పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆమెను ఈ పదవికి ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి, మహిళా సమస్యల పరిష్కారానికి ఆమె చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

పొన్నం శిరీష నియామకం పట్ల హుజూరాబాద్ నియోజకవర్గ స్థాయి టీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి శిరీష కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లాలో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.



ఈ సందర్భంగా స్థానిక నాయకులు, మహిళా కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీ అభయాంజనేయ దేవస్థాన నూతన కమిటీ ఏర్పాటు

ఆలయ అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి

జోర్దార్ హన్మకొండ ప్రతినిధి:హనుమకొండ జిల్లా, గోపాలపురం: బృందావన కాలనీ, రోడ్ నంబర్--4లోని శ్రీ అభయాంజనేయ దేవస్థానం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

2026 నవంబర్ 1వ తేదీ ఆదివారం సాయంత్రం దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో, గత కమిటీ రెండేళ్ల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో ఆలయ నిర్వహణ, నిత్య పూజా కార్యక్రమాలు, పండుగలు, ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండాలనే సదుద్దేశంతో హాజరైన సభ్యులలో అత్యధికుల సమ్మతితో తాత్కాలికంగా బాధ్యతల్లో మార్పులు, చేర్పులు చేస్తూ నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.

నూతన కమిటీ ముఖ్య బాధ్యులు:

డా. ఈసం సారయ్య దొర -- అధ్యక్షులు
మల్యాల దేవేందర్ -- ప్రధాన కార్యదర్శి
పాలకుర్తి మల్లయ్య -- కోశాధికారి
గద్ద చంద్రప్రకాష్ -- ఉపాధ్యక్షులు
లేదాల్ల జోగయ్య -- ఉపాధ్యక్షులు
డా. సార్ల రమేష్ -- ఉపాధ్యక్షులు
అబ్బు శ్రీనివాస్ రెడ్డి - అర్గనైజింగ్ సెక్రెటరీ


అదేవిధంగా కమిటీలోని ఇతర సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, భక్తులందరినీ భాగస్వాములను చేసుకుని దేవస్థానాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఆలయంలో నిత్య పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం, హనుమజ్జయంతి, ప్రత్యేక పర్వదినాల పూజలు, సామూహిక భజనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు వంటి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అలాగే పిల్లలు, యువతలో హిందూ ధర్మం, సనాతన సంప్రదాయాలు, సంస్కృతి, ఆచార వ్యవహారాల పట్ల అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతి ఒక్కరిలో దైవభక్తి, ధర్మనిష్ఠ, సేవాభావం, క్రమశిక్షణ పెంపొందించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

దేవస్థానం కేవలం పూజలకు మాత్రమే పరిమితం కాకుండా భక్తుల ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి, ధార్మిక కార్యక్రమాలకు కేంద్రంగా నిలవాలని పేర్కొన్నారు. ఆలయ పరిశుభ్రత, పూజా కార్యక్రమాల క్రమబద్ధమైన నిర్వహణ, ఆదాయ వ్యయాల్లో పారదర్శకత, భక్తుల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టడం వంటి అంశాలకు







నూతన కమిటీ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

దేవాలయ అభివృద్ధి అనేది ఒకరి బాధ్యత కాదు... ప్రతి భక్తుడి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుంది. కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో, పరస్పర గౌరవంతో, భక్తిశ్రద్ధలతో అందరూ కలిసికట్టుగా ముందుకు సాగి శ్రీ అభయాంజనేయ స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

నూతన కమిటీకి మరోసారి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

గంజాయి నిర్మూలనకు, శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజలంతా సహకరించాలి



● బెల్లంపల్లి ఏసిపి వి. కిరణ్ కుమార్.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:యువతను నాశనం చేస్తున్న గంజాయి నిర్మూలనకు, శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజలంతా సహకరించాలని బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ అన్నారు.

సోమవారం రాత్రి స్థానిక బెల్లంపల్లి బస్తీలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీ (కమ్యూనిటీ పోలీసింగ్) కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు, బస్తీలో, చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కాలనీవాసులు నిరోధించాలని, యువతను నాశనం చేస్తున్న గంజాయిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, ఎవరైనా అమ్మకాలు చేసిన, ప్రోత్సహించిన, స్వీకరించిన, 112 నెంబర్‌కు డయల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కాలనీలో సర్చ్ నిర్వహించి, సరైన ధ్రువపత్రాలు లేని 80 వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించారు.

ధ్రువపత్రాలు చూపించిన అనంతరం వాహనాలను తిరిగి ఇస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే శ్రీనివాసరావు, రూరల్ సీఐ హనూక్, తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవయ్య, బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పట్టాలకు ఎన్ఓసి నిబంధనలను రద్దు చేయాలి

● అధికారులు, ప్రజా ప్రతినిధులు, పునరాలోచించాలి. పట్టణ ప్రజల విజ్ఞప్తి.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:బెల్లంపల్లి పట్టణంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవో 76 ప్రకారం, స్థానికంగా సింగరేణి క్వార్టర్లలో స్థలాలలో ఇల్లు నిర్మించుకొని ఉంటున్న కార్మికులకు కార్మికేతరులకు, ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని సర్వేకు ఆదేశించిన అధికారులు, సింగరేణి సంస్థ నుండి ఎన్ఓసి తీసుకురావాలని నిబంధనలను పెట్టడంతో పట్టణ ప్రజలు ఈ నిబంధన పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో దాదాపు 4 వేల మందికి పట్టాలు మంజూరు చేశారని, అప్పుడు లేని ఎన్ ఓ సి నిబంధన, ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు తీసుకు వచ్చిందో అర్థం కావడం లేదని, అనవసర ఎన్ఓసీ నిబంధనను తొలగించాలని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టణంలో జీవో 76 ప్రకారం ఇళ్లకు, స్థలాలకు పట్టాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహిస్తూ ఎన్ఓసీ నిబంధనను తెలుపడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇప్పటికైనా స్థానిక ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సంయుక్తంగా సర్వే నిర్వహించి అర్హులైన వారిలో ఏ ఒక్కరూ నష్టపోకుండా అందరికీ ఇళ్ల స్థలాలు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ కోర్రీతో ఇప్పటికైనా ఎన్నో సంవత్సరాల నుండి వేచి చూస్తున్నా లబ్ధిదారులకు, పట్టాలు వచ్చేనా అని ఆందోళన చెందుతున్నారు.

చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శేషారెడ్డిని నియమించాలి

● కలెక్టర్,రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివాసీ జేఏసీ చైర్మన్ జల్లి నరేష్ విజ్ఞప్తి

చింతూరు.(ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో):చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా గతంలో సేవలందించిన డాక్టర్ శేషారెడ్డిని తిరిగి నియమించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ చింతూరు డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ పోలవరం జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.గతంలో ఏజెన్సీ ప్రాంతంలో పనిచేసిన సమయంలో డాక్టర్ శేషారెడ్డి గిరిజనులకు విశేష వైద్య సేవలందించారని, మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత పరిస్థితులు, గిరిజనుల ఆరోగ్య సమస్యలపై ఆయనకు పూర్తి అవగాహన ఉందన్నారు.

ప్రస్తుతం గిరిజనులు మెరుగైన వైద్య సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో డాక్టర్ శేషారెడ్డిని తిరిగి సూపరింటెండెంట్‌గా నియమిస్తే ఆసుపత్రి సేవలు మరింత మెరుగు పడతాయని పేర్కొన్నారు.



ఈ విషయంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జల్లి నరేష్ విజ్ఞప్తి చేశారు.

సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం



మొగుళ్లపల్లి,జోర్దార్ ప్రతినిధి:సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధంలా ఉపయోగపడుతుందని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆర్టీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజలు కోరిన సమాచారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా పర్యవేక్షించడంలో పౌరులు కీలక పాత్ర పోషించాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా కో కన్వీనర్ చింతల కుమార్ యాదవ్, కమిటీ సభ్యులు గాదం పోచయ్య, ముత్తోజు వేణు చారి, శనిగల లక్ష్మణ్, కునమల్ల లక్ష్మయ్య, కత్తుల రాజు, చిట్టిమల్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలలో
అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

● ప్రతి రేషన్ షాపులో అధికారుల పేర్లు ఫోన్ నెంబర్లతో సమాచారం బోర్డు ఏర్పాటు చేయాలి



వరంగల్ డివిజన్ జోర్దార్ ప్రతినిధి:వరంగల్ డివిజన్ పరిధిలోని రేషన్ దుకాణాలలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసి పేదలకు న్యాయం చేయాలని కోరుతూ అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు వరంగల్ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుర్తి విజయ్ కుమార్ వరంగల్ జిల్లా రెవెన్యూ డివిజన్ అధికారి డివిజన్ మెజిస్ట్రేట్ టి సుమ గారికి వినతి పత్రం సమర్పించారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ జిల్లా డివిజన్ పరిధిలోని అన్ని మండల పరిధిలోని పలువురు రేషన్ డీలర్ల బియ్యం తూకంలో తేడాలు చూపుతూ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో బియ్యం పంపిణీ చేయకుండా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు పేదలకు అందవలసిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు ఇలాంటి చర్యలతో అర్హులైన పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు

ప్రతి రేషన్ షాప్‌లో సమాచారం బోర్డులు ఏర్పాటు చేయాలి

రేషన్ దుకాణాల్లో అక్రమాలు జరిగినప్పుడు సామాన్య ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వీలుగా ప్రతి షాపులో పౌరసరఫాల శాఖ అధికారులు తాసిల్దార్‌ల పేర్లు ఫోన్ నెంబర్లతో కూడిన సమాచారం బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటే అక్రమాలను వెంటనే వారి దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు

రేషన్ దుకాణాలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి తూకంలో మోసాలు బియ్యం అక్రమ తరలింపులకు పాల్పడే డీలర్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు పేదలకు అందవలసిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని ఆవేదన వ్యక్తం చేస్తూ కోరారు

చదువు చెప్పటం కాదు చదువు లేని
వారిని పట్టుకుని వారికి అక్షరాలు నేర్పాలి

● భావి గురువులకు ఇక తరగతి గదులే కాదు - సామాజిక బాధ్యత కూడా అభ్యసనం లో భాగం- పట్టా కావాలంటే ఐదుగురికి అక్షరాలు నేర్పాల్సిందేలి

● ఉపాధ్యాయ పట్టా అంత తేలిక కాదు - సమాజంలో ఐదుగురిని అక్షరాస్యులుగా మారిస్తేనే పూర్తయినట్లు లెక్కలి



(జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి రావుల రాజేశం,కవి,రచయిత, జర్నలిస్ట్ లెక్చరర్)

1. నియమం ఏమిటి?

ఉపాధ్యాయులుగా తయారవుతున్న విద్యార్థులకు ఇకపై కేవలం తరగతి గదుల్లో పాఠాలు నేర్చుకుని పరీక్షల్లో నెగ్గితే సరిపోదు. తమ చదువు పూర్తి చేసుకుని చేతికి పట్టా రావాలంటే సమాజంలో చదువురాని వారికి తప్పనిసరిగా అక్షరాలు నేర్పాల్సిందేనని కేంద్ర విద్యా శాఖ తేల్చి చెప్పింది. కేవలం విద్యను నేర్చుకోవడం కాదు, విద్యను పంచడం కూడా గురువు లక్షణమనే ఉద్దేశంతో ఈ కొత్త నిబంధన తీసుకొచ్చింది.

2. ఎవరు, ఎలా తయారు చేసారు?

ఈ కొత్త బాధ్యతలకు సంబంధించి జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి 32 పేజీల మార్గదర్శకాలు సిద్ధం చేసింది. ఉల్లాస్ – నవభారత్ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా వీటిని రూపొందించింది. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 15,509 ఉపాధ్యాయ విద్యా సంస్థలు ఉండగా, అందులో 17 లక్షలకు పైగా సీట్లు ఉన్నాయి. సమగ్ర ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం, ప్రాథమిక విద్యలో పట్టా, శారీరక విద్యలో పట్టా, విద్యలో పట్టా, స్నాతకోత్తర పట్టాల వంటి అన్ని కోర్సులకు ఈ నిబంధనలు వర్తిస్తాయి.

3. చదువు కాలాన్ని బట్టి ఎంతమందికి నేర్పాలి?

విద్యార్థి ఉపాధ్యాయులు ఎంతమందికి నేర్పాల నేది వారు చదివే కోర్సు కాలాన్ని బట్టి నిర్ణయించారు.

● రెండేళ్ల కోర్సు చదివేవారు - కనీసం ఐదుగురికి

● మూడేళ్ల కోర్సు చదివేవారు - కనీసం ఆరుగురికి

● నాలుగేళ్ల కోర్సు చదివేవారు - కనీసం ఎనిమిది మందికి అక్షరజ్ఞానం నేర్పాలి.

4. కేవలం చెబితే చాలదు - నెగ్గితేనే లెక్క

ఇక్కడే అసలు కీలక అంశం ఉంది. కేవలం పాఠాలు చెప్పామంటే బాధ్యత తీరినట్లు కాదు. తాము నేర్పిన వారు పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞాన మూల్యాంకన పరీక్షకు హాజరై ఉత్తీర్ణులై, ప్రభుత్వం నుండి అక్షరాస్యులుగా ధ్రువీకరణ పొందాలి. అప్పుడే ఆ విద్యార్థి ఉపాధ్యాయులకు మార్కులు వస్తాయి. ఎంతమందికి చెప్పారు అనేది కాదు, ఎంతమంది నిజంగా అక్షరాస్యులయ్యారు అనేదే ముఖ్యం.

5. ఎవరితో కలిసి చేయాలి?

ఈ పనిని ఒంటరిగా చేయాల్సిన అవసరం లేదు. స్థానిక పాఠశాలలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజ సేవా సంస్థలతో కలిసి చేయాలని మార్గదర్శకాల్లో చెప్పారు. చదువురాని వారిని గుర్తించడం, వారికి చదువు చెప్పే ఏర్పాట్లు చేయడం, పరీక్షకు తీసుకెళ్లడం అన్నీ సమన్వయంతో చేయాలి.

6. రికార్డు, నివేదిక తప్పనిసరి

విద్యార్థి ఉపాధ్యాయులు తాము గుర్తించిన వారి వివరాలతో ప్రత్యేక పట్టీని పెట్టుకోవాలి. ఎలా బోధించారు, వారిలో ఎంత పురోగతి వచ్చింది, తమ బోధనా అనుభవాలు ఏమిటి అనే దానిపై ప్రతిబింబ నివేదిక రాసి సమర్పించాలి.

7. ముగింపు - గురువు అంటే సామాజిక బాధ్యత

2022-23లో మొదలైన ఉల్లాస్ కార్యక్రమం వయోజన అక్షరాస్యతను పెంచడమే లక్ష్యంగా సాగుతోంది. దీన్ని ఉపాధ్యాయ విద్యతో కలపడం ద్వారా నిరక్షరాస్యతను తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఇకపై ఉపాధ్యాయ పట్టా అంటే కేవలం విద్యా ప్రమాణం మాత్రమే కాదు, సామాజిక అక్షరాస్యత సాధన కూడా తప్పనిసరి అర్హత కానుంది.

ఉపాధ్యాయుల కృషి ఎంతో అభినందనీయం



● కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత.

(ఆసిఫాబాద్ జోర్దార్ ప్రతినిధి)అంకితభావంతో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయుల కృషి ఎంతో అభినందనీయమని, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె, హరిత అన్నారు.

రెబ్బెన మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పనితీరు పై, విద్యార్థుల తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుల మేరకు మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు, ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖాముఖి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల పఠనా శక్తి, వివిధ సబ్జెక్టులపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు, ప్రాథమిక విద్యార్థి దశనుండే పాఠశాలలో కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందిస్తున్న ఉపాధ్యాయుల కృషిని అభినందించారు.అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా అందిస్తు న్న అన్నం, కూరలను, పరీక్షించి సంతృప్తిని వ్యక్త ం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి జాప్యం చేయొద్దని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరగాలని ఆమె కోరారు.

ఫార్మసిస్టుల సంక్షేమానికి అధికారులతో సమన్వయం

● డ్రగ్స్ కంట్రోల్ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం ప్రతినిధులు



(నిజామాబాద్: జోర్దార్ ప్రతినిధి)ఫార్మసిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన గౌరవం, ఉద్యోగ భద్రతకు కృషి చేయడమే లక్ష్యంగా తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ ముందడుగు వేసింది. ఇందులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మసిస్టుల సమావేశం అనంతరం నిజామాబాద్ డ్రగ్స్ కంట్రోల్ శాఖ అధికారులను సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఆర్. శ్రీలత, నిజామాబాద్ అర్బన్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీకాంత్‌లను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం ప్రతినిధులు అజ్మీరా గణేష్, నాగశంకర్, లింగాల శంకర్, మౌర్తుజా, షోయబ్, అభిషేక్, మహేష్, గంగాధర్, నరేందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఫార్మసిస్టులకు సముచిత వేతనాలు, ఉద్యోగ భద్రత, వృత్తిపరమైన గౌరవం కల్పించడంతో పాటు ఫార్మసిస్ట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టాల్సిన అవసరాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారానికి డ్రగ్స్ కంట్రోల్ శాఖతో పరస్పర సమన్వయం, సహకారంతో ముందుకు సాగాలని సంఘం ప్రతినిధులు ఆకాంక్షించారు. ప్రజలకు సురక్షితమైన ఔషధ సేవలు అందించడంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమని, వారి వృత్తిపరమైన అభివృద్ధికి అధికారుల సహకారం అవసరమని పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులను ఆత్మీయంగా స్వీకరించిన డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఆర్. శ్రీలత, వి. శ్రీకాంత్‌లకు జిల్లా కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ఫార్మసిస్టుల ఐక్యతే బలం.. వారి సంక్షేమం, వృత్తి గౌరవమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని ప్రతినిధులు పేర్కొన్నారు.

పాడి కౌశిక్ రెడ్డి తన పద్ధతి మార్చుకోవాలి



● ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ నాయకుల ఆరోపణ

కమలాపూర్,(జోర్దార్ ప్రతినిధి)కమలాపూర్ మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అడ్డుపడుతున్నారని మండల కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం కమలాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నా ఎమ్మెల్యే అధికారులకు సహకరించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. తుఫాను ప్రభావంతో ధాన్యం తడిసి నష్టపోయే ప్రమాదం ఉందని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు.ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్ గౌడ్, ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీటీసీ అభ్యర్థి పాయం వెంకయ్యకు
అంబేద్కర్ యువజన సంఘం మద్దతు

● కూనవరం నుంచి పోలిపాక వరకు బైక్ ర్యాలీ



చింతూరు,(ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో):జడ్పీటీసీ అభ్యర్థి పాయం వెంకయ్యకు అంబేద్కర్ యువజన సంఘం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా కూనవరం నుంచి పోలిపాక వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో అంబేద్కర్ యువజన సంఘం, బీజేపీ నాయకులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ ర్యాలీలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మొలకలపల్లి కిషోర్‌తో పాటు బీజేపీ నాయకులు జముడబోయిన వెంకన్న, పు నుగుపాటి ఎస్. కుమార్, కొత్తపల్లి సురేష్, కొత్త పల్లి శ్రీను, కాగానే నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. పాయం వెంకయ్యకు మద్దతుగా సంఘీభావం తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం



హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజూరాబాద్ మండల పరిధిలోని సింగాపూర్ శివారులో గల నేషనల్ హైవే 563 సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమవడం స్థానికంగా కలకలం రేపింది.

బావిలో మృతదేహం తేలియాడుతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో సహాయక చర్యలు చేపట్టి మృతదేహాన్ని బావి నుండి వెలికితీశారు. మృతుడు బ్లూ షర్ట్, జీన్స్ ప్యాంట్ ధరించి ఉండగా, ఆయన మెడలో బాబా తాయెత్తు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే స్థానికులు ఎవరూ అతడిని గుర్తుపట్టకపోవడంతో.. మృతుడు ఇతర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తి అయి ఉండవచ్చని భావిస్తున్నారు.

మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఈ సహాయక చర్యల్లో ఫైర్ ఏఎల్ఎఫ్ తిరుపతి, ఫైర్ ఫైటర్ కె. వెంకటేష్, సిబ్బంది ఎం. అశోక్, పి. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.

జమ్మికుంట ప్రభుత్వ కళాశాలలో
పీజీ స్పాట్ అడ్మిషన్లు

● ఈ నెల 5వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలి

● ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్

(జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి)ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల జమ్మికుంటలో 2026--27 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్ తెలిపారు.

కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన సీపీజీఈటీ--2026 పీజీ ప్రవేశ నిబంధనల ప్రకారం ఈ ప్రవేశాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కళాశాలలో ఎమ్మెస్సీ బోటనీ, జువాలజీ కోర్సుల్లో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ ప్రతులను తీసుకొని ఈ నెల 5వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.

సైదాపూర్‌ను కరువు మండలంగా
ప్రకటించాలని సర్పంచుల ఏకగ్రీవ తీర్మానం

● అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

● కమిటీల రద్దుకు విపక్ష సర్పంచుల నిరసన



సైదాపూర్,జోర్దార్ ప్రతినిధి:సైదాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సర్పంచులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ తీర్మానాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించి వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ సర్పంచులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్హులైన పేదలకే ఇళ్లు కేటాయించాలని, ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలను సర్పంచులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. కమిటీల్లో అధికార పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తూ నిరసన తెలిపారు.ప్రభుత్వ వైద్యాధికారి సమావేశానికి హాజరుకాకపోవడంపై పలువురు సర్పంచులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని కోరారు. సర్పంచుల అరెస్టులపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం తెలుపుతూ డీపీఓ జగదీశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

అక్రమంగా ప్లాట్ల విక్రయం
రిజిస్ట్రేషన్ల రద్దుకు సిఫార్సు చేస్తాం

● నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

● డీఎల్పీవో శ్రీనివాస్



హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి): గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల విక్రయాలు చేపడితే రిజిస్ట్రేషన్ల రద్దుకు సిఫార్సు చేస్తామని డీఎల్పీవో శ్రీనివాస్ హెచ్చరించారు.

హుజూరాబాద్ మండలం చెల్పూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సర్వే నంబర్ 967/ఎలో ఉన్న 14 గుంటల భూమిని రోడ్డు స్థలం కేటాయించకుండా, నాలా కన్వర్షన్, పంచాయతీ అనుమతులు లేకుండానే 8 ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారనే ఫిర్యాదులపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీవో రాజేందర్ గ్రామాన్ని సందర్శించి సర్పంచ్ వంతడుపుల కస్తూరి, ఉపసర్పంచ్ నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి బానోతు రమేష్ సమక్షంలో నాలుగు గంటల పాటు విచారణ నిర్వహించారు. అనంతరం డీఎల్పీవో మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లు, క్రయవిక్రయాలను సహించేది లేదని, విచారణలో నిబంధనల ఉల్లంఘనలు తేలితే ఉన్నతాధికారులకు నివేదించి రిజిస్ట్రేషన్ల రద్దుకు సిఫార్సు చేస్తామని తెలిపారు. గ్రామంలో రహదారుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపైనా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీత అంతం - మా పంతం

భూపాలపల్లి మాజీ డీఎం రాఘవేందర్‌రావు

అక్రమాల వీలలు బట్టబయలు!

- రూ. 300 కోట్ల అక్రమాస్తులు, వందల ఎకరాల భూములు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు
- గణపురం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు.. ఎస్పీ లేఖతో కదిలిన సివిల్ సప్లై శాఖ



హనుమకొండ/భూపాలపల్లి (ప్రత్యేక ప్రతినిధి జోర్దార్)
ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా పక్కదారి పట్టించిన కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న సివిల్ సప్లై శాఖాధికారి, మాజీ జిల్లా మేనేజర్ రాఘవేందర్‌రావు అవినీతి బాగోతం ఒక్కొక్కటిగా బయటపడుతోంది. కేవలం బియ్యం పక్కదారి పట్టించడమే కాకుండా, ఈ ఏడేళ్ల కాలంలో ఆయన అడ్డగోలు సంపాదనతో వందల కోట్లకు పడగలెత్తారన్న ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి.

రూ. 300 కోట్ల అక్రమాస్తులు - వందల ఎకరాల భూములు!
భూపాలపల్లి జిల్లాలో డీఎంగా, ఆ తర్వాత సివిల్ సప్లై కమిషనర్ కార్యాలయంలో ప్రొక్యూర్మెంట్ ఏజీఎంగా పనిచేసిన కాలంలో రాఘవేందర్‌రావు అవినీతి పరాకాష్టకు చేరినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిధులను, ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమ మార్గాల్లో విక్రయించడం ద్వారా వచ్చిన వేల కోట్ల రూపాయలతో బినామీల పేరిట దాదాపు రూ. 300 కోట్ల పైచిలుకు ఆస్తులు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వందల ఎకరాల భూములు కొనుగోలు చేసినట్లు తీవ్ర ఆరోపణలున్నాయి.

తొలిసారిగా 'జోర్దార్ పత్రిక' సంచలన కథనం..
ఈ అవినీతి అధికారిక బాగోతంపై రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా "అవినీతి అధికారులు త్రిమూర్తులు - కమిషనర్లనే తప్పుదారి పట్టిస్తున్న వైనం" అనే శీర్షికతో జోర్దార్ పత్రిక గతంలోనే సంచలన కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం ఆధారంగానే అప్పట్లో . వార్త ప్రచురించడం జరిగింది.

ఎఫ్ఐఆర్ నమోదు.. ఎస్పీ సంచలన లేఖ
తాజాగా, గత ఏడేళ్లలో జరిగిన భారీ బియ్యం అక్రమ రవాణా మరియు గోదాముల్లో సుమారు 300 టన్నుల బియ్యం మాయమైన వ్యవహారంపై పోలీసులు తీవ్రంగా స్పందించారు. గణపురం పోలీస్ స్టేషన్‌లో రాఘవేందర్‌రావుపై అధికారికంగా ఎఫ్ఐఆర్) నమోదైంది. ఈ మేరకు జిల్లా ఎస్పీ (సంకీర్త్) స్వయంగా సివిల్ సప్లై కమిషనర్‌కు లేఖ రాయడంతో ప్రభుత్వ వర్గాల్లో కలకలం రేగింది. ఈ దారి మళ్లించిన బియ్యం అసలు ఎక్కడికి తరలిపోయాయి? దీని వెనుక ఉన్న పెద్ద తలకాయలు ఎవరనే కోణంలో సమగ్ర విచారణ జరుగుతోంది.

త్వరలో మరిన్ని సంచలన నిజాలు వెలుగులోకి..

తల్లిని, బిడ్డని ఒక్కటి చేసి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కేటీఆర్



హైదరాబాద్: ఉపాధి కల్పిస్తామని నమ్మించి మోసం చేయడంతో మస్కట్‌లో చిక్కుకుపోయిన వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గానికి చెందిన తుప్పుడు లక్ష్మిని సురక్షితంగా స్వదేశానికి రప్పించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన మాట నిలబెట్టుకున్నారు. నెల రోజుల్లోనే తల్లిని ఇంటికి తీసుకొస్తానని ఆమె కుమారుడు రాజుకు ఇచ్చిన హామీని నెరవేర్చి ఆ కుటుంబంలో ఆనందం నింపారు.

సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని గోకఫసల్వాద గ్రామానికి చెందిన తుప్పుడు లక్ష్మి, భర్త వెంకటప్ప ఉపాధి కోసం ఫిబ్రవరి 27న మస్కట్‌కు వెళ్లారు. అయితే అక్కడికి చేరుకున్న తర్వాత ఏజెంట్ చెప్పిన పనికి భిన్నమైన పని అప్పగించడంతో ఆమె తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అంతేకాకుండా యజమాని (కఫీల్) ఆమె పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుని స్వదేశానికి పంపించేందుకు నిరాకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తనను విదేశాలకు పంపించిన ఏజెంట్ కూడా ఫోన్‌కు స్పందించకుండా, తిరిగి భారత్‌కు పంపించేందుకు రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్లు లక్ష్మి కుటుంబానికి తెలిపింది. ఈ క్రమంలో ఆమె వైపై, సిమ్ కార్డు సేవలు కూడా నిలిచిపోవడంతో కుటుంబ సభ్యులతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. చివరకు పక్కింటి వారి ఇంటర్నెట్ సహాయంతో తన కుమారుడు రాజును సంప్రదించి అక్కడ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.తల్లి పడుతున్న కష్టాలను చూసి చలించిపోయిన కుమారుడు రాజు సెప్టెంబర్ 29న కేటీఆర్‌ను కలిసి తమ కుటుంబ పరిస్థితిని వివరించారు. స్పందించిన కేటీఆర్ నెల రోజుల్లోనే పాస్‌పోర్టు సమస్యను పరిష్కరించి, తల్లిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొస్తానని రాజుకు భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కేటీఆర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు లేఖ రాయడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకున్నారు. దీంతో లక్ష్మి సురక్షితంగా భారత్‌కు తిరిగి చేరుకున్నారు.స్వదేశానికి చేరుకుని కుటుంబ సభ్యులను కలుసుకున్న అనంతరం లక్ష్మి ఈరోజు (మంగళవారం) హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉన్న సమయంలో అండగా నిలిచి, కుమారుడికి ఇచ్చిన మాటను నెల రోజుల్లోనే నిలబెట్టుకున్న కేటీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగంతో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా తుప్పుడు లక్ష్మి మాట్లాడుతూ.."నా కొడుకుకు కేటీఆర్ గారు నెల రోజుల్లోనే నిన్ను ఇంటికి తీసుకొస్తానని మాట ఇచ్చారు. అన్న ఇచ్చిన మాట ప్రకారం నన్ను సురక్షితంగా ఇంటికి తీసుకొచ్చారు. నేను, నా కుటుంబం ఎదుర్కొంటున్న కష్టకాలంలో కేటీఆర్ అన్న మాకు అండగా నిలిచారు.

ఆయన చేసిన సహాయాన్ని జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను.

కేటీఆర్ అన్నకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు" అని లక్ష్మి తెలిపారు

నగరాల్లో తీవ్రమవుతున్న వాయు కాలుష్యం

జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న నిపుణులు



ముంబై నగరంలో వాయు కాలుష్యం తీవ్రత ఇటీవల పెరిగి, ఢిల్లీ స్థాయిలను కూడా దాటడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ముంబైలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 322కు చేరింది. ఇది అత్యంత అధ్వాన్నమైన గాలి నాణ్యత విభాగంలోకి వస్తుంది. అదే సమయంలో ఢిల్లీలో ఏక్యూఐ 176గా నమోదైంది. సముద్ర తీర ప్రాంతంలో ఉండడం, సముద్రపు గాలులు వీయడం వల్ల ముంబైలో కాలుష్యం తక్కువగా ఉంటుందనే అభిప్రాయం ఉన్నప్పటికీ, తాజా పరిస్థితులు ఆ అంచనాలను మార్చుతున్నాయి. వర్షాకాలం ముగిసిన తర్వాత వాతావరణం పొడిగా మారడం, నిర్మాణ పనులు, రోడ్లపై దుమ్ము, గాలుల వేగం తగ్గడం వంటి కారణాలతో కాలుష్య కారకాలు గాలిలోనే పేరుకుపోతున్నాయి. కలుషిత గాలిని పీల్చడం వల్ల ఆస్తమా తీవ్రత పెరగడం, గుండె, ఊపిరితిత్తుల సమస్యలు అధికమవడం వంటి ఆరోగ్య ప్రమాదాలు ఉన్నాయి.

కారణాలు ఏమిటి..
ముంబైలో కాలుష్యం పెరగడానికి పలు కారణాలు ఉన్నాయి. నిర్మాణ పనులు, భవనాల కూల్చివేతలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ము వల్ల గాలిలో సూక్ష్మ ధూళికణాలు పెరుగుతున్నాయి. వాహనాల రద్దీ, పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి వెలువడే పొగ, పరిశ్రమల నుంచి విడుదలయ్యే కాలుష్య ఉద్గారాలు కూడా గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. బాణసంచా కాల్చడం, చెత్తను బహిరంగంగా తగులబెట్టడం వల్ల హానికరమైన పొగ, ధూళికణాలు గాలిలో కలుస్తున్నాయి. గాలుల వేగం తగ్గినప్పుడు కాలుష్య కారకాలు భూమికి దగ్గరగా నిలిచిపోతాయి. వర్షాకాలం తర్వాత పొడి వాతావరణం కారణంగా దుమ్ము ఎక్కువసేపు గాలిలో తేలియాడుతుంది. ఎల్‌నినో ప్రభావంతో గాలుల వేగం, కాలుష్య కారకాల వ్యాప్తిలో మార్పులు వచ్చి పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఒక్కో కారణం ఎంతవరకు ప్రభావం చూపుతోందో తెలుసుకోవడానికి మరింత పరిశీలన అవసరం.

ఎలాంటి అనారోగ్యాలు వస్తాయి..
వాయు కాలుష్యంలో ప్రధానంగా పీఎం 2.5 వంటి అతి సూక్ష్మ ధూళికణాలు ప్రమాదకరమైనవి. ఇవి ఊపిరితిత్తుల్లోకి లోతుగా చొచ్చుకుపోవడంతోపాటు, కొన్ని సందర్భాల్లో రక్తప్రవాహంలోకి కూడా చేరుతాయి. కలుషిత గాలిని పీల్చడం వల్ల దగ్గు, గొంతులో మంట, పిల్లికూతలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలుగుతాయి. ఆస్తమా ఉన్నవారిలో సమస్యలు తీవ్రమవుతాయి. గుండెపై ఒత్తిడి పెరిగి గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం కూడా అధికమవుతుంది. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, గుండె లేదా ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడేవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. పిల్లల్లో ఊపిరితిత్తులు ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలో ఉండడంతో కాలుష్యం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలం కలుషిత గాలికి గురికావడం వల్ల దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి..
కాలుష్యం ఎక్కువగా ఉన్న రోజుల్లో బయటకు వెళ్లే ముందు స్థానిక గాలి నాణ్యత సూచీని పరిశీలించాలి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెబ్‌సైట్ లేదా సమీర్ యాప్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉన్నప్పుడు బయట పరుగెత్తడం, సైక్లింగ్, కఠినమైన వ్యాయామాలు చేయడం తగ్గించి, వీలైతే ఇంట్లోనే వ్యాయామం చేయాలి. తప్పని సరిగా బయటకు వెళ్లాల్సి వస్తే సరిగ్గా అమర్చుకున్న ఎన్95 లేదా దానికి సమానమైన రక్షణ మాస్క్ ధరించాలి. కాలుష్యం ఎక్కువగా ఉన్నప్పుడు కిటికీలు, తలుపులు మూసి ఉంచడం, అవసరమైతే హెచ్ఈపీఏ ఫిల్టర్ ఉన్న గాలి శుద్ధి పరికరాన్ని ఉపయోగించడం మంచిది. ఇంట్లో పొగ, ధూపం, కొవ్వొత్తుల వినియోగాన్ని తగ్గించాలి. పిల్లలు, వృద్ధులు బయట ఎక్కువసేపు గడపకుండా చూడాలి. ఆస్తమా ఉన్నవారు వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడాలి. తీవ్రమైన శ్వాస ఇబ్బంది, ఛాతీ నొప్పి, పెదవులు నీలం రంగులోకి మారడం, గందరగోళం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి. వ్యక్తిగత జాగ్రత్తలతోపాటు నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము నియంత్రణ, బహిరంగంగా చెత్త తగులబెట్టడంపై చర్యలు, పరిశ్రమల కాలుష్య నియంత్రణ,
స్వచ్ఛమైన రవా ణా వ్యవస్థ వంటి చర్యలు కూడా అవసరం.
స్వచ్ఛమైన గాలి పర్యావరణానికే కాదు, ప్రజల ఆరోగ్యానికి కూడా అత్యంత కీలకం

ఊపిరితిత్తుల సమస్యలను ఏఐ ముందుగానే గుర్తించగలదు.. వెల్లడించిన నిపుణులు..



క్షయవ్యాధి, ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) కీలక పాత్ర పోషిస్తుందని వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు.

వ్యాధులను ముందుగానే గుర్తించడం, త్వరగా నిర్ధారించడం, ఎక్కువ మందికి సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించడం వంటి అంశాల్లో ఈ సాంకేతికత వైద్యులకు సహాయపడుతుందని తెలిపారు.

ఇటీవల జైపూర్‌లో జరిగిన 28వ జాతీయ ఛాతీ వైద్యుల సంయుక్త వార్షిక సదస్సులో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి భారత్‌తో పాటు ఇతర దేశాల నుంచి 2వేల మందికి పైగా ఊపిరితిత్తుల వైద్యులు, పరిశోధకులు, ఆరోగ్య నిపుణులు హాజరయ్యారు.

కృత్రిమ మేధస్సుతో గణనీయమైన మార్పులు..
శ్వాసకోశ వ్యాధులను గుర్తించే విధానంలో కృత్రిమ మేధస్సు గణనీయమైన మార్పులు తీసుకువస్తుందని నిపుణులు పేర్కొన్నారు. ఛాతీ ఎక్స్‌రేలు, సీటీ స్కాన్లలో అనుమానాస్పద మార్పులను గుర్తించేందుకు ఏఐ ఆధారిత పరికరాలు సహాయపడతాయని తెలిపారు. దీనివల్ల వైద్యులు త్వరగా నిర్ణయాలు తీసుకోవడంతోపాటు, రోగులకు అవసరమైన తదుపరి పరీక్షలను సకాలంలో సూచించగలుగుతారని వివరించారు. క్షయవ్యాధి, ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు అధికంగా ఉన్న భారత్‌లో వైద్యుల అనుభవంతో కలిపి ఈ సాంకేతికతను ఉపయోగిస్తే మంచి ప్రయోజనం ఉంటుందని అన్నారు.

లక్షణాలను గుర్తించే ఏఐ..
ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ ఛాతీ ఎక్స్‌రే చిత్రాలను విశ్లేషించి, క్షయవ్యాధికి సంబంధించిన లక్షణాలను గుర్తిస్తుందని నిపుణులు తెలిపారు. తద్వారా మరిన్ని పరీక్షలు అవసరమైన రోగులకు ముందుగా ప్రాధాన్యం ఇవ్వవచ్చని వివరించారు. ముఖ్యంగా నిపుణులైన రేడియాలజిస్టులు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మొబైల్ వైద్య పరీక్షా కార్యక్రమాల్లో ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఢిల్లీలోని వల్లభాయ్ పటేల్ ఛాతీ వైద్య సంస్థ సంచాలకుడు డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ..

ఏఐ సహాయంతో ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించడం వల్ల క్షయవ్యాధి గుర్తింపు కార్యక్రమాల పరిధి, సామర్థ్యం మెరుగుపడతాయని తెలిపారు.

పెరుగుతున్న ఏఐ ప్రాధాన్యం..
ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణలోనూ కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం పెరుగుతోందని సదస్సులో చర్చించారు.

ఆధునిక కంప్యూటర్ విధానాలు సీటీ స్కాన్లను పరిశీలించి, ఊపిరితిత్తుల్లో అనుమానాస్పద గడ్డలను గుర్తించడంలో వైద్యులకు తోడ్పడుతాయని నిపుణులు చెప్పారు. తదుపరి పరీక్షలు అవసరమయ్యే మార్పులను ముందుగానే గుర్తించి వైద్యుల దృష్టికి తీసుకురావడం ద్వారా వ్యాధి నిర్ధారణ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని వివరించారు

చద్దన్నంతో ఎన్నో ప్రయోజనాలు

ఛీ చద్దన్నం అని చీప్‌గా తీసిపారేయకండి..!



చాలామంది చద్దన్నం అంటే ఇష్టపడరు. కొందరైతే చద్దన్నం అనే మాట వింటేనే వ్వాక్ అంటారు. అమ్మో చద్దన్నం తినడం నావల్ల కాదు అని చెబుతుంటారు. కానీ ఒక్కసారి చద్దన్నం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకున్నారంటే ఇకపై చద్దన్నం వద్దు అనే మాట మీ నోట రానేరాదు. రాత్రి మిగిలిన అన్నాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో పొద్దున తినడం మాత్రమే కాదు.. రాత్రికి మిగలేలా అన్నం వండుకుని మరీ ఉదయాన్నే చద్దన్నం తింటారు. చద్దన్నంలో అంత గొప్ప తనం ఏముంది అనుకుంటున్నారా..? అయితే వివరాల్లోకి వెళ్దాం పదా..?
చద్దన్నంతో ఎన్ని లాభాలుంటాయో ఇటీవల అమెరికన్ న్యూట్రిషియన్ అసోసియేషన్ అధ్యయనంలో వెల్లడైంది. ఆ అధ్యయనం ప్రకారం.. అన్నం పులిస్తే ఐరన్, పొటాషియమ్, కాల్షియం వంటి సూక్ష్మ పోషకాల స్థాయి పెరుగుతుంది. అందుకే చద్దన్నంలో ఆ పోషకాల పాళ్లు ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు రాత్రి వండిన అన్నంలో 100 గ్రాములకు 3.4 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటే.. తెల్లారేసరికి అది 73.91 మిల్లీ గ్రాములకు పెరుగుతుంది. బీ6, బీ12 విటమిన్లు కూడా ఎక్కువగా లభిస్తాయి. అందుకే చద్దన్నం తింటే శరీరం తేలికగా ఎనర్జిటిక్‌గా ఉంటుంది.
అంతేకాదు చద్దన్నంతో శరీరానికి కావాల్సినంత బ్యాక్టీరియా లభిస్తుంది. ఒంట్లో వేడి చేయడం కారణంగా మన బాడీలో కలిగే దుష్ఫలితాలను చద్దన్నం తగ్గిస్తుంది. తరచూ చద్దన్నం తినడంవల్ల ఫైబర్ కంటెంట్ పెరిగి మల బద్దకం, నీరసం లాంటి సమస్యలు తగ్గిపోతాయి. అదేవిధంగా రక్తపోటు (బీపీ) అదుపులో ఉండి, ఆందోళన తగ్గుతుంది. శరీరం ఎక్కువసేపు ఉల్లాసంగా ఉండటానికి తోడ్పడుతుంది. అంతేగాక ఒంట్లోని అలర్జీ కారకాలు, మలినాలు తొలగిపోతాయి. పేగుల్లో అల్సర్ల వంటివి ఉంటే తగ్గిపోతాయి. ఎదిగే పిల్లలకు కూడా చద్దన్నం మంచి పౌష్టికాహారం.

లావుంటే సన్నగా.. సన్నగుంటే లావుగా..
ఈ చద్దన్నం సన్నగా ఉన్నవాళ్లు లావయ్యేందుకు, లావుగా ఉన్నవాళ్లు సన్నబడేందుకు కూడా తోడ్పడుతుంది. లావు తగ్గాలంటే రాత్రి మిగిలిన అన్నాన్ని రాత్రే చల్లలో నానబెట్టుకుని ఉదయాన్నే తినాలి. రోజూ ఇలా చేయడంవల్ల స్థూలకాయులు క్రమంగా లావు తగ్గుతారు. అదేవిధంగా రాత్రి మిగిలిన అన్నంలో పాలుపోసి చిటికెడు పెరుగుతో తోడేసుకుంటే తెల్లారేసరికే తోడన్నం తయారవుతుంది. నిత్యం ఈ తోడన్నం తినడం వల్ల సన్నగా ఉన్నవాళ్లు క్రమంగా ఒళ్లు చేస్తారు. ఇలా పాలతో తోడేసిన అన్నాన్ని గానీ, చల్లలో నానబెట్టిన అన్నాన్నిగానీ నేరుగా తినబుద్ధికాకపోతే వాటికి ఉల్లిముక్కలు, టమాటా, క్యారెట్ లాంటివి కలుపుకుని తాలింపు పెట్టుకుని కూడా లాగించొచ్చు.

గమనిక :అయితే, ఇలా చేసి పెట్టుకున్న చద్దన్నాన్ని తప్పనిసరిగా ఉదయాన్నే తినాలి. మరింత ఆలస్యం చేస్తే అది ఎక్కువగా పులిసి అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

ఇది తలైవా ప్రభంజనం.. బాక్సాఫీస్ వద్ద జైలర్ 2 సెన్సేషన్..



సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ జైలర్ 2. డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ మూవీ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతుంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ ఇప్పుడు థియేటర్లలో వసూళ్ల సునామీ సృష్టిస్తుంది. తాజాగా ఈ సినిమా సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకుందామా.బాక్సాఫీస్ వద్ద సూపర్‌స్టార్ రజనీకాంత్ సరికొత్త చరిత్ర సృష్టించారు. డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతుంది. ఇప్పటికే వసూళ్ల సునామీ సృష్టించిన ఈ మూవీ ఇప్పుడు మరోసారి సంచలనంగా మారింది. తాజాగా ఈ మూవీ అధికారికంగా రూ. 800 కోట్ల మైలురాయిని అధిగమించింది. తమిళ సినీ పరిశ్రమ చరిత్రలోనే రూ. 800 కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టిన మొట్టమొదటి చిత్రంగా నిలిచి ఆల్‌టైమ్ ఇండస్ట్రీ హిట్‌గా మారింది. 75 ఏళ్ల వయసులోనూ రజనీకాంత్ తన బాక్సాఫీస్ స్టామినాను చాటుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఈ చిత్రం మూడో వీకెండ్‌లోనూ తన ప్రభంజనాన్ని కొనసాగించింది. 18వ రోజు ఆదివారం నాటికి ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 807.25 కోట్లకు చేరాయి. దేశీయంగా భారత మార్కెట్‌లో నెట్ వసూళ్లు రూ. 456.30 కోట్లకు చేరుకోగా, గ్రాస్ వసూళ్లు రూ. 533.75 కోట్ల మార్కును తాకాయి. ఆదివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా రూ. 11.20 కోట్ల నికర వసూళ్లను సాధించడం విశేషం. తమిళ వెర్షన్‌తో పాటు హింది, తెలుగు వర్షన్లలోనూ ఈ సినిమా మంచి కలెక్షన్లు రాబట్టింది.ఇండియా బాక్సాఫీస్ చరిత్రలోనే అత్యధిక గ్రాస్ రాబట్టిన చిత్రాల జాబితాలో 'జైలర్ 2' 16వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ క్రమంలో భారతీయ సినిమా బ్లాక్‌బస్టర్లుగా నిలిచిన '2.0' (రూ. 519.65 కోట్లు), 'బాహుబలి: ది బిగినింగ్' (రూ. 515.77 కోట్లు), 'సలార్: పార్ట్ 1' (రూ. 512 కోట్లు), 'దంగల్' (రూ. 511.58 కోట్లు) వంటి భారీ చిత్రాల ఆల్-టైమ్ దేశీయ రికార్డులను తిరగరాసింది.ఎస్.జే. సూర్య, విద్యా బాలన్, మిథున్ చక్రవర్తి, రమ్యకృష్ణ, యోగి బాబు వంటి నటీనటులు ఈ చిత్రంలో కీలకపాత్రలో నటించారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో రూపుదిద్దుకున్న ఈ సీక్వెల్ కోలీవుడ్ రేంజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. నాలుగో వారం పూర్తయిన అనంతరం ఈ చిత్రం డిజిటల్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోకి అడుగుపెట్టనుంది.

రష్మికను ఎప్పుడూ ఇలా చూసి ఉండరు..



నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ సినిమా 'మైసా'. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ సినిమాలో రష్మిక ఇంతకుముందెన్నడూ కనిపించని రీతిలో సరికొత్త అవతారంలో కనిపించనుంది. గిరిజన గోండు మహిళ పాత్రలో ఆమె పవర్‌ఫుల్ రోల్ పోషించింది. రవీంద్ర పుల్లె తెరకెక్కించిన ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే మైసా చిత్రం నుంచి విడుదలైన గ్లింప్స్, టీజర్, పోస్టర్లకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ అంచనాలను మరింత పెంచుతూ మేకర్స్ ఈ రోజు సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేశారు. 'ఓ మైసా రే' అంటూ సాగే ఈ పాట ఇప్పుడు ఆడియెన్స్ కు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. మహిళా శక్తిని, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేలా ఈ పాట సాగుతూ శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా ఉరుములాంటి బీట్స్‌తో సాగే ఈ పాట ఆద్యంతం అదే టెంపో, ఎనర్జీని కొనసాగిస్తూ ఎలక్ట్రిఫైయింగ్ మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తోంది. ఇక ఈ సాంగ్ లో రష్మిక ఉగ్ర అవతారంలో కనిపించింది. సాంగ్ లో ఆమె చూపించిన ఎక్స్ ప్రెషన్స్ నెక్ట్స్ లెవెల్ అని చెప్పవచ్చు. సుద్దాల అశోక్ తేజ రాసిన ఈ పాట లిరిక్స్ కూడా చాలా అర్థవంతంగా ఉన్నాయి. అల్లు జేక్స్ బిజోయ్ అందించిన ఇంటెన్స్, పవర్‌ఫుల్ మ్యూజిక్ ఈ సాంగ్ ను నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్లింది. మొత్తానికి ప్రస్తుతం యూట్యూబ్ లో 'ఓ మై సారే' సాంగ్ ఫుల్ ట్రెండింగ్ లో ఉంది.ఇక మైసా సినిమా విషయానికి వస్తే..ఈ సినిమాలో రష్మికతో పాటు సముద్ర ఖని, ఈశ్వరి రావు తదితరులు ప్రధాన పాత్రలు పోషించనున్నారు. కొత్త తరహా యాక్షన్ థ్రిల్లర్‌గా 'మైసా' విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న 'మైసా'లో రష్మిక పాత్ర ఎలా ఉండబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన కంటెంట్ తో సినిమాపై అంచనాలు అమాంతం మరింత పెరిగాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగుతో పటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.



వాటికి అడ్డుకట్ట వేయండి.. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు మెగాస్టార్ చిరంజీవి రిక్వెస్ట్

కళాకారులను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన, మార్ఫింగ్ చేసిన వీడియోలను రూపొందించడంపై ఇటీవల ఎక్స్ వేదికగా తన ఆందోళనను వ్యక్తం చేసిన మెగాస్టార్ చిరంజీవి.. ఈ అంశంపై మరో కీలక అడుగు వేశారు. ఈ రోజు హైదరాబాద్‌లో గౌరవ కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారిని కలిసి, ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్ సమస్యలను వివరించారు. ఈ భేటీలో చిరంజీవి గారితో పాటు రామ్ చరణ్ కూడా పాల్గొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌ఫేక్ టెక్నాలజీలను దుర్వినియోగం చేస్తున్న తీరును స్వయంగా వివరించేందుకు చిరంజీవి ఈ భేటీకి అపాయింట్‌మెంట్ కోరారు. ఈ సాంకేతికతల దుర్వినియోగం కళాకారుల హక్కులు, గౌరవం, క్రియేటివ్ కంటెంట్‌కు ముప్పుగా మారుతోందని ఆయన వివరించారు. ఈ సమస్యను కేవలం సోషల్ మీడియా వేదికకే పరిమితం చేయకుండా, చిత్ర పరిశ్రమ తరపున ఇటువంటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు మరింత పటిష్టమైన రక్షణ చర్యలు, కఠినమైన శిక్షలు అమలు చేయాలని కోరారు.చిరంజీవి ఆందోళనలను సానుకూలంగా అర్థం చేసుకున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారు.. ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యవసరంగా పరిశీలిస్తుందని, మరింత పటిష్టమైన రక్షణ చర్యలు, కఠినమైన శిక్షలు అమలు చేసే దిశగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ విషయంపై లిఖితపూర్వకంగా వినతిపత్రం సమర్పించాలని సూచించిన ఆయన, ఈ వ్యవహారాన్ని సమన్వయం చేసే బాధ్యతను జి. కిషన్ రెడ్డి గారికి అప్పగించారు. కేంద్ర హోంమంత్రి స్పందనకు కృతజ్ఞతలు తెలిపిన చిరంజీవి.. ఆయన ఇచ్చిన హామీ చిత్ర పరిశ్రమకు ప్రోత్సాహాన్నిచ్చే కీలక అడుగుగా అభివర్ణించారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభించి, కళాకారులకు తగిన రక్షణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏంటీ.. మమితా బైజు అసలు పేరు ఇది కాదా



వెండితెరపై కొందరు నటీమణులు తమ సహజమైన నటన, అద్భుతమైన హావభావాలతో ప్రేక్షకులను కట్టిపడేస్తుంటారు. పరిశ్రమలో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకుంటూ బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగిస్తుంటారు. ప్రస్తుతం దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ సెన్సేషన్ మమితా బైజు సరిగ్గా అలాంటి కోవకే చెందుతారు. అయితే ఈ టాలెంటెడ్ బ్యూటీ అసలు పేరు వెనుక ఒక ఆసక్తికరమైన, అనుకోని కథ దాగి ఉంది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మమిత తన పేరు మార్పు వెనుక ఉన్న అసలు నిజాన్ని బయటపెట్టి అభిమానులను ఆశ్చర్యపరిచారు. మమితా బైజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె పుట్టినప్పుడు తల్లిదండ్రులు ముద్దుగా పెట్టిన అసలు పేరు 'నమిత'. ఎంతో ఆలోచించి ఈ పేరును ఎంచుకున్నప్పటికీ, ఆ తర్వాత బర్త్ సర్టిఫికెట్ నమోదు చేసే సమయంలో జరిగిన చిన్న ముద్రణా పొరపాటు వల్ల ఆ పేరు కాస్తా 'మమిత'గా మారిపోయింది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మమిత తన పేరు మార్పు వెనుక ఉన్న అసలు నిజాన్ని బయటపెట్టి అభిమానులను ఆశ్చర్యపరిచారు. మమితా బైజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె పుట్టినప్పుడు తల్లిదండ్రులు ముద్దుగా పెట్టిన అసలు పేరు 'నమిత'. ఎంతో ఆలోచించి ఈ పేరును ఎంచుకున్నప్పటికీ, ఆ తర్వాత బర్త్ సర్టిఫికెట్ నమోదు చేసే సమయంలో జరిగిన చిన్న ముద్రణా పొరపాటు వల్ల ఆ పేరు కాస్తా 'మమిత'గా మారిపోయింది.చిత్రమేమిటంటే, ఈ చిన్న తప్పును ఆమె కుటుంబసభ్యులు నాలుగైదు సంవత్సరాల వరకు గమనించలేకపోయారట. చిన్నారి మమితను పాఠశాలలో చేర్పించేందుకు రికార్డులను పరిశీలించినప్పుడు అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటికే అధికారిక పత్రాల్లో ఆ పేరే ఖరారు కావడంతో, మార్చడం కుదరక విధిలేక ఆ పేరునే కొనసాగించాల్సి వచ్చింది. అలా అనుకోకుండా జరిగిన ఆ టైపోగ్రాఫికల్ పొరపాటే ఆమెను 'మమిత'గా మార్చేసింది.చిత్రమేమిటంటే, ఈ చిన్న తప్పును ఆమె కుటుంబసభ్యులు నాలుగైదు

హీరోయిన్ కీర్తి సురేశ్‌కు చేదు అనుభవం

టాలీవుడ్, కోలీవుడ్‌లలో తనదైన అభినయంతో, సహజమైన నటనతో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలుగుతున్న హీరోయిన్ కీర్తి సురేశ్. మహానటి సినిమాకుగానూ జాతీయ అవార్డు అందుకున్న ఈ అమ్మడు ఇప్పుడు కంటెంట్ ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ ప్రశంసలు అందుకుంటున్నారు. హిట్టు, ప్లాపులతో సంబంధమే లేకుండా ప్రేక్షకులు మెచ్చే కథలను ఎంపిక చేసుకుంటూ బిజీగా ఉంటుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కీర్తి సురేశ్ తన జీవితంలో ఎదురైన ఊహించని సంఘటన గురించి పంచుకుంది. సినిమాలతో ఎప్పుడూ బిజీగా ఉండే ఈ బ్యూటీకి ఇటీవల విమాన ప్రయాణంలో ఒక చేదు అనుభవం ఎదురైనట్లు చెప్పుకొచ్చింది. సెలబ్రిటీలు ఎక్కడికి వెళ్లినా వారిని గుర్తించి అభిమానం చూపించడం సాధారణమే అయినప్పటికీ, కొంతమంది ప్రవర్తించే తీరు ఒక్కోసారి ఇబ్బందికరంగా మారుతుంటుంది. తాజాగా కీర్తి సురేశ్ విషయంలోనూ అదే జరిగిందని వెల్లడించింది.



వివరాల్లోకి వెళితే.. కీర్తి సురేశ్ తన భర్తతో కలిసి విమాన ప్రయాణంలో ఉన్న సమయంలో తోటి ప్రయాణికులలో ఒక వ్యక్తి మద్యం మత్తులో ఆమె వద్దకు వచ్చాడని తెలిపింది. విమానం గాల్లో ఉండగానే ఆ వ్యక్తి పరిమితులు మీరి ఆమెతో సెల్ఫీ దిగాలని తీవ్రంగా ఇబ్బంది పెట్టాడని వెల్లడించింది. కేవలం ఫొటో కోసమే కాకుండా, ఆయన ప్రవర్తించిన తీరు కాస్త అభ్యంతరకరంగా ఉండటంతో కీర్తి సురేశ్ తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని.. వెంటనే అతడికి దూరంగా జరిగినట్లు వెల్లడించింది.వెంటనే అప్రమత్తమైన తన భర్త ఆంటోని సీరియస్ అయ్యాడని.. అయినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో అక్కడే ఉన్న విమాన సిబ్బందిని పిలిచినట్లు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన క్యాబిన్ క్రూ సిబ్బంది జోక్యం చేసుకుని ఆ వ్యక్తిని అక్కడి నుంచి పంపించివేశారని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం కీర్తి సురేశ్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. సెలబ్రిటీల వ్యక్తిగత భద్రత

అబ్బి బ్బా.. మైండ్ బ్లాక్ చేస్తున్న గ్లామర్ హాట్‌నెస్.



సోషల్ మీడియాలో ప్రతి రోజూ ఎంతోమంది సెలబ్రిటీల ఫోటోలు వైరల్ అవుతుంటాయి. కానీ కొన్ని ఫోటోలు మాత్రం చూడగానే నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకోవడమే కాకుండా, "ఈమె ఎవరా?" అని ఆలోచించేలా చేస్తాయి. ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్న ఈ అందమైన ఫోటో కూడా సరిగ్గా అలాంటిదే. అందాల లెహంగాలో మెరిసిపోతూ అతిలోక సుందరిలా కనిపిస్తున్న ఈ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టగలరా.. ? తన ముఖాన్ని సగం దాచేస్తూ, మెరిసిపోయే వెండి రంగు లేహంగాలో ఎంతో రాయల్ అండ్ గ్లామరస్ లుక్‌లో దర్శనమిస్తోంది ఈ సుందరి. ఆమె శరీరాకృతి, స్టైలిష్ పోజ్ మరియు రాయల్ జ్యువెలరీ నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మరి ఈ అందాల భామ ఎవరో మీరు గుర్తుపట్టారా? భారతదేశంలో విపరీతమైన ప్రజాదరణ పొందిన 'బిగ్ బాస్' హిందీ సీజన్ 8 లో కంటెస్టెంట్‌గా పాల్గొని మంచి పాపులారిటీ సంపాదించుకుంది. ప్రసిద్ధ హిందీ సాంగ్ 'డీజె వాలే బాబు' ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. భారత క్రికెట్ జట్టు స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాను వివాహం చేసుకుని, ఆ తర్వాత విడాకులు తీసుకుని వార్తల్లో నిలిచిన ప్రముఖ నటి. ఆమె మరెవరో కాదు.. నటాషా స్టాంకోవిచ్.రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు,

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224